సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
ముద్ర
హైదరాబాద్
ఆదివారం, 01.11.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 360
పేజీలు: 08 వెల: రూ. 5

తెలంగాణలో వర్షాలు

- అల్పపీడనం ప్రభావంతో ఐదు రోజులు
- నవంబర్ 2,3 తేదీల్లో పలు జిల్లాల్లో భారీగా
- ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వానలు

రేపటి నుంచి నవంబర్ 4 వరకు వానలు

02

బీఆర్ఎస్‌లో చేరికల చిచ్చు!

- గులాబీ గూటికి పాత నేతలు.. పార్టీలో కొత్త మంటలు!
- చేరికల ప్రచారంతో బీఆర్ఎస్‌లో అసమ్మతి సెగ..
- కష్టకాలంలో అండగా నిలిచిన నేతల పరిస్థితి ఏంటి?
- చేరికలా.. క్యాడర్ మనోభావాలా?

కేసీఆర్‌కు కొత్త తలనొప్పి?

పార్టీని వీడిన వారికి మళ్లీ స్వాగతం పలుకుతారా?

ముద్ర, తెలంగాణ బ్యూరో: తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ చేరికల రాజకీయం వేడెక్కుతోంది. రాబోయే ఎన్నికలే లక్ష్యంగా ప్రధాన పార్టీలు ఇప్పటి నుంచే వ్యూహాలకు పదును పెడుతున్నాయి. అధికార కాంగ్రెస్ సంక్షేమ పథకాలే విజయాన్ని అందిస్తాయని ధీమా వ్యక్తం చేస్తుండగా.. ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు తమ రాజకీయ బలాన్ని పెంచుకునే ప్రయత్నాల్లో ఉన్నాయి. ఈ క్రమంలో బీఆర్ఎస్‌లోకి పాత నేతలు తిరిగి వస్తారన్న ప్రచారం ఇప్పుడు గులాబీ పార్టీలో కొత్త చిచ్చు రేపుతోంది. ముఖ్యంగా పార్టీని వీడి వెళ్లిన నేతలను తిరిగి చేర్చుకోవాలన్న



ఆలోచనపై సొంత పార్టీ మద్దతుదారుల నుంచే వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

మాజీ మంత్రి కొండా సురేఖ వ్యవహారం ఈ చర్చకు మరింత ఆజ్యం పోసింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై గతంలో చేసిన వ్యాఖ్యలను ఆమె ఉపసంహరించుకోవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. మంత్రి పదవి కోల్పోయిన నేపథ్యంలో ఆమె తిరిగి బీఆర్ఎస్ వైపు చూస్తున్నారనే ప్రచారం తెరపైకి వచ్చింది. అయితే ఈ ఊహాగానాలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మరోవైపు కాంగ్రెస్‌కు చెందిన మరికొందరు నేతలు కూడా కారు పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

అయితే అసలు సమస్య చేరికల్లోనే ఉందా? అన్న ప్రశ్న ఇప్పుడు బీఆర్ఎస్ శ్రేణుల్లో వినిపిస్తోంది. గతంలో పార్టీని వీడి వెళ్లిన నేతలు తిరిగి వస్తే వారికి ఎలాంటి ప్రాధాన్యత ఇస్తారు? కష్టకాలంలో పార్టీని నమ్ముకుని నిలబడిన నాయకులు, కార్యకర్తల పరిస్థితి ఏమిటి? అన్న ప్రశ్నలు పార్టీ మద్దతుదారుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

సోషల్ మీడియా వేదికగా పలువురు గులాబీ పార్టీ అభిమానులు తమ అసంతృప్తిని బహిరంగంగానే వ్యక్తం చేస్తున్నారు. పార్టీని కష్టాల్లోకి నెట్టిన వారిని మిగతా 02లో

మియాపూర్ భూములపై క్రెడిట్ వార్

ఘనత మాదేనంటున్న బీఆర్ఎస్!

- సుప్రీంకోర్టులో 192 విచారణల్లో న్యాయపోరాటం చేశాం..
- కేసీఆర్ ప్రభుత్వమే ప్రభుత్వ భూములను కాపాడింది
- రూ.50 వేల కోట్ల విలువైన 550 ఎకరాలపై రాజకీయ రగడ..
- వేలానికి రేవంత్ సర్కారు యత్నాలపై బీఆర్ఎస్ అభ్యంతరం

02

కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ పదవుల జాతర!

మూడు స్థానాలు.. ఆశావహులు ఎందరో..

రేసులో పలువురు నేతలు

- సామాజిక సమీకరణాలే కీలకం!
- మాదిగ, బీసీ, ఓసీ వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చే యోచన..
- ఎవరిని వరిస్తుందో అదృష్టం?
- రేసులో ఉన్నది వీరే!

ముద్ర, తెలంగాణ బ్యూరో: తెలంగాణ కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ పదవుల సందడి మొదలైంది. నవంబర్ 14తో గవర్నర్ కోటాలోని 3 ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానుండటంతో అధికార పార్టీలో ఆశావహుల హడావుడి పెరిగింది. పదేళ్లుగా పార్టీని నమ్ముకుని పనిచేసిన నేతలు ఈసారి తమకు అవకాశం వస్తుందని ఆశలు పెట్టుకున్నారు. దీంతో 3 స్థానాలు ఎవరికి దక్కుతాయన్న అంశం కాంగ్రెస్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

ఈసారి ఎమ్మెల్సీ పదవుల భర్తీలో సామాజిక సమీకరణాలకే కాంగ్రెస్ అధిష్టానం పెద్దపీట వేయనున్నట్లు తెలుస్తోంది. ఎస్సీ మాదిగ, బీసీ, ఓసీ వర్గాలకు ఒక్కో స్థానం కేటాయించే అంశంపై పార్టీలో చర్చ జరుగుతున్నట్లు సమాచారం. ఇప్పటికే పలువురు నేతలు తమకు అవకాశం కల్పించాలంటూ పార్టీ పెద్దల వద్ద ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

మాదిగ కోటాలో ఎవరికి ఛాన్స్?

మూడు స్థానాల్లో ఒకటి ఎస్సీ మాదిగ సామాజికవర్గానికి కేటాయించే అవకాశాలున్నాయనే ప్రచారం జోరుగా సాగుతోంది. రేసులో దొమ్మాటి సాంబయ్య, నాగరిగారి ప్రీతమ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌తో పాటు చారుకొండ వెంకటేష్ తమ ప్రయత్నాలు చేస్తున్నారు. సామాజిక సమీకరణాలతో పాటు పార్టీకి చేసిన సేవలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థిని ఎంపిక అవకాశం ఉంది. మిగతా 02లో

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
ఆదివారం, 01 నవంబర్, 2026

ఆహారాన్ని బాగా నమిలి తినండి!

తొందరగా ఆహారం మింగేయకుండా ప్రతి ముద్దను నెమ్మదిగా నమలండి. ఇలా చేయడం వల్ల జీర్ణక్రియకు సహకారం అందుతుంది. గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలు తగ్గే అవకాశం ఉంటుంది.

బాలికపై ఉన్మాది ఘాతుకం

ముద్ర, అనంతపురం :
పాఠాలు వినిపించాల్సిన పాఠశాల ప్రాంగణం ఒక్కసారిగా ఆర్తనాదాలతో విలవిలలాడింది. అనంతపురం జిల్లా రాప్తాడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం అత్యంత పాశవిక, దిగ్భ్రాంతికర సంఘటన చోటుచేసుకుంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రశాంతంగా పాఠాల్లో నిమగ్నమై ఉన్న సమయాన, ఓ ఉన్మాది హఠాత్తుగా ఎలక్ట్రిక్ రంపంతో తరగతి గదిలోకి చొరబడ్డాడు. పదో తరగతి చదువుతున్న ఒక బాలికపై రంపంతో విచక్షణారహితంగా దాడికి తెగబడ్డాడు. కళ్లెదుటే జరిగిన ఈ దారుణాన్ని చూసి తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు భయంతో పరుగులు తీశారు.
దుండగుడు జరిపిన పదునైన రంపపు దాడిలో ఆ పసిపాప కుడి చేయి తెగిపడగా, ముఖం, గొంతు భాగాల్లో తీవ్రమైన లోతైన గాయాలయ్యాయి. రక్తం ఓడుతూ పాఠశాల ఆవరణలోనే కుప్పకూలిన చిన్నారిని ఉపాధ్యాయులు, స్థానికులు వెంటనే అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రి అత్యవసర విభాగంలో వైద్యుల బృందం బాలికను కాపాడేందుకు శ్రమిస్తోంది. ఆపదలో ఉన్న విద్యార్థిని పరిస్థితి ఇంకా విషమంగానే ఉనట్లు వైద్యులు స్పష్టం చేశారు.
దాడికి పాల్పడిన అనంతరం ఉపాధ్యాయులు అతడిని చుట్టుముట్టే లోపే ఆ దుండగుడు అక్కడి నుంచి పారిపోయాడు. అయ్యవారిపల్లెకు చెందిన ఈ విద్యార్థినికి నిత్యం ఆటోలోనే స్కూలుకు వెళ్లే అలవాటు ఉందని, ఎవరైనా వేధిస్తున్నట్లు ఎప్పుడూ తమకు చెప్పలేదని బాలిక మేనత్త తెలిపారు. అసలు పాఠశాల లోపలికి రంపంతో ఒక వ్యక్తి ఎలా రాగలిగాడని ప్రశ్నిస్తూ బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితుడు ఎంతటి వారైనా, ఆఖరికి తమ బంధువైనా సరే కఠినంగా శిక్షించాల్సిందేనని డిమాండ్ చేశారు.
సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక వివరాలు సేకరించారు. పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థుల నుంచి సమాచారం తీసుకుని కేసు నమోదు చేశారు. పారిపోయిన నిందితుడి ఆచూకీ కనుగొనేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. పాఠశాల ఆవరణలో చోటుచేసుకున్న ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి.
రాప్తాడు ఘటనలో పదో తరగతి బాలికపై దాడి చేసిన నిందితుడిని నాగులూరుకు చెందిన హేమంత్ గా పోలీసులు గుర్తించారు. ధర్మవరం రైల్వే స్టేషన్లో అతడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. బాధిత విద్యార్థినికి నిందితుడు సమీప బంధువేనని.. ప్రేమను నిరాకరించడంతో దాడి చేసినట్లు ప్రాథమికంగా పోలీసులు గుర్తించారు. ఫోరెన్సిక్ బృందం తరగతి గదిలో ఆధారాలు సేకరిస్తోంది.
రాప్తాడు హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన ఈ అమానుష దాడిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి, ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాబుద్ధులు నేర్పే పాఠశాలలోకి రంపంతో వచ్చి దాడి చేయడం దారుణమన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిక ఆరోగ్య పరిస్థితిని, అందిస్తున్న వైద్య సేవలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘాతుకానికి పాల్పడిన ఉన్మాదిని వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని పోలీసు ఉన్నతాధికారులను సీఎం ఆదేశించారు.

తెలంగాణలో వర్షాలు

ముద్ర, హైదరాబాద్:
బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నబ్ తుపాను ప్రభావం వీడినా, దానికి అనుబంధంగా ఛత్తీస్‌గఢ్ నుంచి తూర్పు మధ్యప్రదేశ్ వరకు వ్యాపించిన అల్పపీడన అవశేషం ఇంకా కొనసాగుతోంది. దీనికితోడు దక్షిణ అండమాన్ సముద్రంలో కొత్తగా ఏర్పడిన మరో అల్పపీడనం రాబోయే రెండు రోజుల్లో ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దిశగా కదిలే సూచనలు కనిపిస్తున్నాయి. వీటి సంయుక్త ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల శని, ఆది, సోమ, మంగళవారాల వరకు అంటే నవంబరు 3వ తేదీ దాకా పలు జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ స్పష్టం చేసింది.
గడిచిన నెలన్నర రోజులుగా ఎల్‌నినో ప్రభావంతో తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో రాష్ట్ర ప్రజలు తీవ్ర వేడిమి, ఉక్కపోతలతో అల్లాడిపోయారు. అయితే శుక్రవారం కురిసిన వర్షాలు రాష్ట్రవ్యాప్తంగా వాతావరణాన్ని

ఒక్కసారిగా చల్లబరిచి ప్రజలకు ఊరటనిచ్చాయి. ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌లో కుండపోత వర్షం కురవడంతో ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసరలో గరిష్ఠంగా 11.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి, యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండల్లో 8.9 సెం.మీ., బీబీనగర్, బహదూర్‌పుర, జూపార్క్ ప్రాంతాల్లో 8.2 సెం.మీ. చొప్పున వాన కురిసింది. అలాగే మాదాపూర్, శేరిలింగంపల్లి, రామన్నపేట, చిట్యాల, పోచంపల్లి, షేక్‌పేట తదితర ప్రాంతాల్లోనూ మోస్తరు వర్షపాతం నమోదైంది.
గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మాదాపూర్, కూకట్‌పల్లి, ఖైరతాబాద్, చార్మినార్, నాంపల్లి, ఉప్పల్ వంటి అనేక ప్రాంతాల్లో మోకాలిలోతున వరద నీరు ప్రవహించడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఐటీ కారిడార్‌లో సాయంత్రం వేళ భారీగా ట్రాఫిక్ నిలిచిపోయి కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఇక, రాబోయే మూడు నాలుగు రోజులు వర్ష సూచన ఉన్నందున వర్షాల వల్ల నిత్యజీవితానికి కొంత ఆటంకం కలిగినప్పటికీ, కరువు వాతావరణంతో అల్లాడుతున్న వేళ ఈ వర్షాలు కురవడం పట్ల నగరవాసులు కొంత ఊపిరి పీల్చుకుంటున్నారు.

కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ పదవుల జాతర!

(మొదటి పేజీ తరువాయి)

ఓసీ కోటాలో బ్రాహ్మణులకు ప్రాధాన్యత?
మరో స్థానాన్ని ఓసీ వర్గానికి కేటాయించాలనే ఆలోచనలో పార్టీ నాయకత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కోటాలో బ్రాహ్మణ సామాజికవర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలనే ప్రతిపాదన చర్చకు వచ్చినట్లు సమాచారం. ఈ వర్గం నుంచి హర్కర వేణుగోపాల్ పేరు ప్రధానంగా వినిపిస్తుండగా, దయాసాగర్ పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

బీసీ కోటాలో భారీ పోటీ!
ఇక బీసీ సామాజికవర్గం నుంచి ఎమ్మెల్సీ పదవి ఆశిస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. ముఖ్యంగా పద్మశాలి వర్గానికి అవకాశం దక్కవచ్చనే చర్చ జరుగుతోంది. ఈ రేసులో ఈరవత్రి అనిల్, కైలాష్ నేత, సంగిశెట్టి జగదీశ్వర్, జక్కని అనిత తదితరుల పేర్లు వినిపిస్తున్నాయి. మరోవైపు యాదవ సామాజికవర్గం నుంచి చరణ్ కౌశిక్ యాదవ్, లోకేష్ యాదవ్, లింగం యాదవ్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. మహిళా ప్రాతినిధ్యాన్ని దృష్టిలో పెట్టుకుంటే సునీత రావు పేరు కూడా తెరపైకి వస్తోంది.

పదవులు దక్కకపోతే మరో అవకాశం!
మూడు ఎమ్మెల్సీ స్థానాల కోసం పోటీ తీవ్రంగా ఉన్న నేపథ్యంలో అందరికీ అవకాశం కల్పించడం పార్టీ నాయకత్వానికి సవాలుగా మారింది. సామాజిక సమీకరణాలు, పార్టీకి చేసిన సేవలు, రాజకీయ ప్రాధాన్యత వంటి అంశాలు ఎంపికలో కీలకం కానున్నాయి. ఎమ్మెల్సీ పదవులు దక్కని ఆశావహులకు ఏఐసీసీ కార్యదర్శులు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా అవకాశాలు కల్పించే అంశం కూడా చర్చకు వస్తున్నట్లు సమాచారం.
మొత్తానికి మూడు ఎమ్మెల్సీ స్థానాలు.. ఆశావహులు మాత్రం పదుల సంఖ్యలో ఉండటంతో తెలంగాణ కాంగ్రెస్‌లో రాజకీయ సందడి నెలకొంది. సామాజిక వర్గాల లెక్కలు ఎవరికి అనుకూలంగా మారతాయి? పార్టీ అధిష్టానం ఎవరిపై మొగ్గు చూపుతుంది? పదవుల పందెంలో చివరకు విజేతలుగా నిలిచేదెవరు? అన్నది ఇప్పుడు కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్కంఠ రేపుతోంది.

సవాళ్లు ఎదుర్కొని సొంత నావిక్!

ముద్ర, బెంగలూరు :
ఇస్రో చరిత్రలో మరో మైలురాయి. స్వదేశీ నావిక్ వ్యవస్థ కోసం జీఎస్ఎల్‌వీ–ఎఫ్18 రాకెట్ ద్వారా నింగిలోకి పంపిన ఎన్‌వీఎస్–03 ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైంది. ఈ విజయాన్ని అందుకునే క్రమంలో ఇస్రో అనేక సవాళ్లను ఎదుర్కొంది. దీనికంటే ముందు 2025 జనవరిలో చేపట్టిన ఎన్‌వీఎస్–02 ఉపగ్రహ ప్రయోగం విఫలమవడంతో ఇస్రో విమర్శలు ఎదుర్కొంది. అయితే.. అప్పట్లో తలెత్తిన కనెక్టర్ వైఫలాన్ని అధికమించడానికి ఎన్‌వీఎస్–03 ఉపగ్రహాన్ని బెంగళూరులోని ఇస్రోకు చెందిన స్పేస్ అప్లికేషన్ సెంటర్‌లో తయారు చేశారు. ఇందులో స్వదేశీ రుబీడియం అటామిక్ క్లాక్ ఉంది. అలాగే ఎల్1, ఎల్5, ఎస్ బ్యాండ్‌లతో సంకేతాలను ప్రసారం చేయనుంది. భారత ప్రాంతీయ నావిగేషన్ శాటిలైట్ వ్యవస్థ సేవల కొనసాగింపు కోసం ఎన్వీఎస్–03 ఉపగ్రహం పని చేస్తుంది. భారత భౌగోళిక పరిధితోపాటు, సరిహద్దుల ఆవల 1,500 కి.మీ. పరిధి వరకూ ఈ నావిగేషన్ సిస్టమ్ కవర్ చేస్తుంది. అమెరికాకు చెందిన జీపీఎస్, రష్యాకు సంబంధించిన గ్లోనాస్, యూరోప్ కు చెందిన గెలీలియో, చైనాలోని బీడౌ నావిగేషన్ శాటిలైట్ వ్యవస్థలు ప్రపంచాన్ని కవర్ చేస్తున్నాయి. అలాగే నావిక్ అనేది భారత ప్రాంతంపై పనిచేసే స్వతంత్ర నావిగేషన్ వ్యవస్థ.



బీఆర్ఎస్‌లో చేరికల చిచ్చు

(మొదటి పేజీ తరువాయి)
తిరిగి చేర్చుకోవడం సరైన నిర్ణయం కాదంటూ ఘాటైన వ్యాఖ్యలు చేస్తు న్నారు. అధికారం కోల్పోయిన సమయంలోనూ పార్టీ కోసం నిలబడిన వారికి కాకుండా, రాజకీయ అవసరాల కోసం పార్టీలు మారిన వారికి మళ్లీ పెద్దపీట వేస్తే క్యాడర్‌కు తప్పుడు సంకేతాలు వెళ్తాయని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే అధికారానికి దూరమై రాజకీయంగా ఒడిదొడుకులు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్‌కు ఈ పరిణామాలు కొత్త సవాలుగా మారే అవకాశముంది. సీఎం రేవంత్ రెడ్డి దూకుడు, గత ప్రభుత్వ హయాంలోని నిర్ణయాలపై కొనసాగుతున్న దర్యాప్తులు పార్టీకి రాజకీయంగా సవాళ్లు విసురుతున్నాయి. ఇలాంటి సమయం లో పార్టీ బలోపేతానికి ఇతర పార్టీల నేతలను చేర్చుకోవాలా? లేక ఉన్న క్యాడర్‌ను కాపాడుకుంటూ ముందుకు సాగాలా? కీలక ప్రశ్న.
ఒకవైపు రాజకీయ బలాన్ని పెంచుకోవాలన్న లక్ష్యం.. మరోవైపు నమ్ముకున్న కార్యకర్తల మనోభావాలు! ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడం కేసీఆర్‌కు అంత సులభం కాబోదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో పార్టీని వీడిన నేతలకు గులాబీ కండువా కప్పేందుకు కేసీఆర్ సిద్ధమవుతారా? అలా జరిగితే సొంత పార్టీలో అసంతృప్తిని ఎలా చల్లారుస్తారు? రాబోయే ఎన్నికల వ్యూహంలో చేరికలకు ఎంత ప్రాధాన్యతిస్తారు? అన్నది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

వారంలో 5 రోజులే పని

ముద్ర, హైదరాబాద్ :
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లోనూ వారానికి ఐదు రోజుల పనిదినాల విధానాన్ని అమలు చేయాలని ఉద్యోగుల జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో అమలవుతున్న తరహాలోనే రాష్ట్రంలోనూ ఈ విధానాన్ని ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల ఉమ్మడి జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస రావు.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు వినతిపత్రం అందజేశారు.
ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనివేళలు ఉన్నాయి. వీటిని ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మార్చాలని జేఏసీ ప్రతిపాదించింది. ఈ విధానం అమలైతే రోజుకు ఏడున్నర గంటల పనివేళలు ఉంటాయని, రెండో శనివారం సాధారణ సెలవును పరిగణనలోకి తీసుకుంటే వారానికి 37.5 గంటల పని పూర్తవుతుందని వివరించింది.
ఎల్‌నినో ప్రభావంతో నీరు, విద్యుత్, ఇంధన కొరత ఏర్పడే అవకాశాలున్నాయని జేఏసీ తన వినతిపత్రంలో పేర్కొంది. వారానికి ఐదు రోజుల పనివిధానం అమలు చేస్తే ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్, నీటి వినియోగం తగ్గుతుందని తెలిపింది. వాహనాల రాకపోకలు తగ్గడం ద్వారా ఇంధనం ఆదా కావడంతో పాటు వాయు కాలుష్యం కూడా తగ్గుతుందని వివరించింది.
ఉద్యోగులకు వారానికి రెండు రోజుల విశ్రాంతి లభించడం వల్ల పని ఒత్తిడి తగ్గి సామర్థ్యం, పనితీరు మెరుగుపడతాయని జేఏసీ నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ విధానం అమలుతో ప్రభుత్వ ఖజానాపై అదనపు ఆర్థిక భారం పడదని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా 5 రోజుల పనిదినాల విధానాన్ని అమలు చేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరారు.

భూములపై క్రెడిట్ వార్

ముద్ర, హైదరాబాద్ :
హైదరాబాద్‌లో అత్యంత విలువైన ప్రభుత్వ భూములుగా గుర్తింపు పొందిన మియాపూర్‌లోని 550 ఎకరాల భూముల వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఈ భూములను కాపాడిన ఘనత తమ ప్రభుత్వానిదేనని బీఆర్ఎస్ స్పష్టం చేస్తోంది. సుదీర్ఘ న్యాయపోరాటం చేసి ప్రభుత్వ భూములను పరిరక్షించామని, ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆ క్రెడిట్‌ను తన ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపిస్తోంది. దీంతో మియాపూర్ భూముల వ్యవహారం అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ వివాదానికి తెరలేపింది.
మియాపూర్‌లోని సుమారు 550 ఎకరాల భూముల విలువ ప్రస్తుత మార్కెట్ అంచనాల ప్రకారం రూ.50 వేల కోట్లకు పైగా ఉంటుందని భావిస్తున్నారు. ఈ భూముల యాజమాన్య హక్కులు, వివాదాల పరిష్కారం కోసం సుదీర్ఘకాలంగా న్యాయపోరాటం కొనసాగింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టులో మొత్తం 192 విచారణలు జరిగాయని బీఆర్ఎస్ నేతలు పేర్కొంటున్నారు. ఈ కేసులో అత్యధిక భాగం తమ ప్రభుత్వ హయాంలోనే పోరాడామని, అప్పటి సీఎం నేతృత్వంలోని ప్రభుత్వం ప్రభుత్వ భూములను కాపాడేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని చెబుతున్నారు.
అయితే సుప్రీంకోర్టు విచారణలు, తీర్పుల నేపథ్యంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వ్యవహారంపై తనదైన ప్రచారం చేసుకుంటోందని బీఆర్ఎస్ విమర్శిస్తోంది. గతంలో తాము చేసిన న్యాయపోరాటాన్ని పక్కనపెట్టి, భూములను కాపాడిన ఘనతను కాంగ్రెస్ తనకు ఆపాదించుకోవడం సరికాదని అంటోంది. భూముల పరిరక్షణలో ఎవరి పాత్ర ఎంత ఉందో వివరించాలని డిమాండ్ చేస్తోంది.
మరోవైపు ఈ భూములను వేలం వేయాలన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వ ఆలోచనలపైనా బీఆర్ఎస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులను వేలం ద్వారా ఆదాయ వనరులుగా మార్చాలని చూడటం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని విమర్శిస్తోంది. భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడే విలువైన భూములను విక్రయించకుండా ప్రభుత్వ ఆస్తులుగా పరిరక్షించాలని కోరుతోంది.
మొత్తంగా మియాపూర్ భూముల వ్యవహారం ఇప్పుడు కేవలం భూవివాదానికే పరిమితం కాకుండా రాజకీయ ప్రతిష్ఠకు సంబంధించిన అంశంగా మారింది. భూములను కాపాడిన ఘనత ఎవరిది? వేలం ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వం ఎలా వినియోగించనుంది? అనే ప్రశ్నలు చర్చనీయాంశంగా మారాయి. రానున్న రోజుల్లో ఈ అంశం రాజకీయాల్లో మరింత వేడి పుట్టించే అవకాశముంది.

ఖర్గే ఇంట్లో 'మాక్ పార్లమెంట్'

ముద్ర, న్యూఢిల్లీ :
ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై విపక్ష 'ఇండియా' కూటమి పక్షాలు వినూత్న నిరసనకు శ్రీకారం చుట్టాయి. పార్లమెంటులో తమకు తగిన అవకాశం దక్కలేదనే కారణంతో, సామాన్య ప్రజలకు కూడా ఈ విషయాలు తెలియాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ మాక్ పార్లమెంట్‌కు లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ స్పీకర్‌గా వ్యవహరించగా, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే స్వయంగా పబ్లిక్ ఇంపీచ్‌మెంట్ తీర్మానాన్ని ఖర్గే ప్రవేశపెట్టనున్నారు. దేశంలో ఎన్నికల నిర్వహణ తీరు, ఓట్ల తొలగింపు, ఈవీఎంల విషయంలో సీఈసీ వ్యవహరిస్తున్న తీరు సరిగ్గా లేదని ఖర్గే ఆరోపించారు. దేశానికి స్వాతంత్ర్యం రాగానే మహిళలకు ఓటు హక్కు కల్పించిన ఏకైక దేశం భారత్ అని గుర్తుచేశారు. కుల, మత, పేద, ధనిక భేదం లేకుండా అన్ని వర్గాలకు నాడు కాంగ్రెస్ ఓటు హక్కు కల్పించిందని అన్నారు. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం ఆ ఓట్లను అక్రమంగా తొలగిస్తోందని మండిపడ్డారు. ఎన్నికల నిర్వహణలో అక్రమాలకు పాల్పడిన జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందే అని ఈ సందర్భంగా ఖర్గే సహా ఇండియా కూటమి ఎంపీలంతా డిమాండ్ చేశారు.
ఈ సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు ఇండియా కూటమికి చెందిన పలు పార్టీల ముఖ్య నేతలు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రజాస్వామ్యాన్ని, ఎన్నికల వ్యవస్థను కాపాడుకోవడానికి తాము ఈ పోరాటం చేస్తున్నట్లు విపక్ష నేతలు స్పష్టం చేశారు.

భారీ సైబర్ స్కామ్

ముద్ర, హైదరాబాద్ :
నగరంలో సంచలనం సృష్టించిన రూ.24 కోట్ల భారీ సైబర్ ట్రేడింగ్ మోసం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కొరడా ఝుళిపించింది. హైదరాబాద్‌లోని మూడు కీలక ప్రాంతాల్లో అధికారులు ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ప్రధాన నిందితుడు అలంరాజు సత్యనారాయణ మూర్తికి చెందిన నివాసాలు, వ్యాపార కార్యాలయాలే లక్ష్యంగా ఈ సోదాలు కొనసాగాయి. నకిలీ ట్రేడింగ్ వెబ్‌సైట్‌తో వల స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే స్వల్ప కాలంలోనే భారీ లాభాలు వస్తాయంటూ నిందితుడు బాధితులకు ఆశ చూపించాడు. ఫోన్ కాల్స్, సోషల్ మీడియా మెసేజ్‌ల ద్వారా నిమేష్ అనే బాధితుడిని సంప్రదించి, ఓ నకిలీ వెబ్‌సైట్ ద్వారా ట్రేడింగ్ చేయాల్సిందిగా నమ్మించాడు. బాధితుడిని పూర్తిగా బురిడీ కొట్టించి విడతల వారీగా ఏకంగా రూ.24,76,21,042 వసూలు చేశాడు. తీరా అసలు పెట్టుబడితో పాటు రావాల్సిన లాభాలను సైతం తిరిగి ఇవ్వకుండా మొహం చాటేశాడు.
2023 మే 23 నుంచి 2024 మే 27 మధ్య కాలంలో నిందితుడు ఏకంగా రూ.26.02 కోట్ల మేర మోసపూరిత లావాదేవీలు సాగించినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. దర్యాప్తు సంస్థల నిఘా నుంచి తప్పించుకునేందుకు, డబ్బు మూలాలను దాచేందుకు పలు 'మ్యూల్' బ్యాంకు ఖాతాల ద్వారా నిధులను మళ్లించాడు. ఆ సొమ్ముతో తన కుటుంబ సభ్యులు, ఉద్యోగుల పేర్లతో పలు వ్యాపార సంస్థలను ప్రారంభించాడు. 'ఆశ్రిత ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్' పేరిట హైదరాబాద్‌లో లగ్జరీ విల్లా ప్రాజెక్టును మొదలుపెట్టడంతో పాటు BTR ఇండస్ట్రీస్, వెలుగు ట్రేడింగ్ కంపెనీ, ఆశ్రిత మెగా సొల్యూషన్స్ పేర్లతో షెల్ కంపెనీలను నడిపినట్లు తేలింది.

ఇందిరాగాంధీకి నివాళి

ముద్ర, న్యూఢిల్లీ :
మాజీ ప్రధాని, భారతరత్న ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా న్యూఢిల్లీలో 'శక్తి స్థల్' వద్ద సీఎం రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. శక్తి స్థల్ వద్ద ఏఐసీసీ అగ్రనాయకులు సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ తో కలిసి ముఖ్యమంత్రి నివాళులర్పించారు. అనంతరం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) GSLV–F18 రాకెట్ ద్వారా NVS–03 నావిగేషన్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన సందర్భంగా ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సిబ్బందికి సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఉపగ్రహాన్ని నిర్దేశిత భూస్థిర కక్ష్యలోకి ప్రవేశపెట్టడం భారత నావిగేషన్ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే కీలక మైలురాయి అని ప్రశంసించారు. రవాణా, విమానయానం, సముద్ర నావిగేషన్, పర్యవేక్షణ, అత్యవసర సేవల వంటి కీలక రంగాల్లో NVS –03 మెరుగైన సేవలు అందించనుందని సీఎం పేర్కొన్నారు. ఈ విజయం యావత్ దేశానికి గర్వకారణమని, భవిష్యత్తులో ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

భోజన సమయంలో కళ్లకు విశ్రాంతి ఇవ్వండి!

రోజంతా మొబైల్, కంప్యూటర్ స్క్రీన్లను చూస్తుంటే కళ్లపై ఒత్తిడి పెరుగుతుంది. కనీసం భోజనం చేసే సమయం లోనైనా ఫోన్‌కు దూరంగా ఉండి కళ్లకు విశ్రాంతి కల్పించండి.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఛలో ఢిల్లీ: కోమటిరెడ్డి

ముద్ర, హైదరాబాద్, అక్టోబర్ 31: ఓటర్ల హక్కుల పరిరక్షణ, రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో చేపట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజా స్పందన లభిస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని, ఓటు హక్కును బలహీనపరిచే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలపై సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను కేంద్రం రాజకీయ కక్ష సాధింపు కోసం ఉపయోగిస్తోందని విమర్శించారు. ఢిల్లీ నిరసనకు వస్తున్న ప్రజలను అడ్డుకునేందుకు నిర్బంధాలు, రవాణా ఆంక్షలు విధిస్తున్నారని ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటం ఆగదని, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

పట్టణాభివృద్ధిలో సాంకేతికత కీలకం: కె. గోవర్ధన్ రెడ్డి

ముద్ర, హైదరాబాద్, అక్టోబరు 31: పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఆధునిక సాంకేతికత, డిజిటల్ పర్యవేక్షణ, ఏఐ ఆధారిత ప్రణాళికలు కీలకమని ఎంఈఐఎల్ ప్రాజెక్ట్స్ అధ్యక్షుడు కె. గోవర్ధన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ అర్బన్ ఇన్నోవేషన్ సమ్మిట్–2026లో ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్టుల వేగం, నాణ్యత పెంచేందుకు ఆధునిక నిర్మాణ పద్ధతులు ఉపయోగించుకోవాలని సూచించారు. నిర్మాణ నాణ్యత, ఇంజినీరింగ్ ప్రమాణాలు, కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. తెలంగాణలో వైద్యం, విద్య, తాగునీరు, రహదారులు, ప్రజా రవాణా, విద్యుత్తు, సాగునీటి రంగాల్లో ఎంఈఐఎల్ పలు ప్రాజెక్టులు చేపడుతోందని తెలిపారు. ప్రభుత్వ శాఖలతో సమన్వయంతో ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూర్చే మౌలిక సదుపాయాల కల్పనకు సంస్థ కట్టుబడి ఉందన్నారు.

యాదాద్రిని దర్శించుకున్న గవర్నర్ దంపతులు

ముద్ర, యాదాద్రి భువనగిరి : తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల, ఆయన సతీమణి జానకి శుక్ల శనివారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదగిరిగుట్ట దేవస్థానంలో శ్రీ జనార్ధనానంద సరస్వతి స్వామి సంస్కృతి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తు న్న తెలంగాణ వేద విద్వన్మహాసభలకు గవర్నర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి గవర్నర్‌కు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం అర్చకులు వేదాశీర్వచనం అందించారు. దేవస్థానం ఈవో భవానీ శంకర్ స్వామివారి జ్ఞాపిక, ప్రసాదాలను అందజేశారు. అనంతరం యాదగిరిగుట్ట దేవస్థానం రూపొందించిన 2027 వార్షిక క్యాలెండర్‌ను గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటించలేదు

- మంత్రి తుమ్మల

ముద్ర, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటించిందని ప్రచారం జరగుతున్న వేళ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుదీనిపై క్లారిటీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి క్రాప్ హాలిడే ప్రకటన చేయలేదని, ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని రైతులు నమ్మొద్దని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతున్న విపత్తు అని పేర్కొన్నారు. ఎల్‌నినో దృష్ట్యా ఆరుతడి పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు మంత్రి వివరించారు. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను రాయితీపై అందజేస్తున్నట్టు తెలిపారు. ఆరు నెలలుగా ఎల్‌నినోపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని.. వారు నష్టపోకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని చెప్పారు.

ఎస్‌బీఐ రూ.5.01 కోట్ల విరాళం

ముద్ర, అమరావతి : అర్నబ్ తుఫాన్‌తో తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు అండగా నిలిచేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ముందుకొచ్చింది. తుఫాన్ బాధితులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.5.01 కోట్ల విరాళాన్ని అందించింది. ఈ మేరకు ఎస్‌బీఐ మేనేజింగ్ డైరెక్టర్ అమర రామ్మోహన్ రావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం శనివారం అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసి విరాళానికి సంబంధించిన చెక్కును అందజేసింది. తుఫాన్ కారణంగా నష్టపోయిన ప్రజలను ఆదుకునేందుకు ఉదారంగా విరాళం అందించిన ఎస్‌బీఐ యాజమాన్యానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. విపత్కర పరిస్థితుల్లో బాధితులకు అండగా నిలిచేందుకు ముందుకొచ్చిన బ్యాంకు ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ అమరావతి సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల్ కుమార్, జనరల్ మేనేజర్ కుందన్ జ్యోతి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ షేక్ షమీన్ భాను తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా ప్రక్షాళనను ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?

కాంగ్రెస్‌పై బండి సంజయ్ తీవ్ర విమర్శలు

ముద్ర, హైదరాబాద్ : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసం వ్యతిరేకిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చనిపోయిన వారి పేర్లు, డూప్లికేట్ ఓట్లు, అక్రమ వలసదారుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించకూడదా? అని ప్రశ్నించారు.

1952 నుంచి 2025 వరకు దేశంలో 12 సార్లు SIR ప్రక్రియ జరిగిందని, అందులో పదిసార్లు కాంగ్రెస్ పాలనలోనే అమలైందని గుర్తుచేశారు. కాంగ్రెస్ గెలిచినప్పుడు ఎన్నికల సంఘంపై నమ్మకం ఉంటుందని, ఓడిపోయినప్పుడు మాత్రం ఈవీఎంలు, ఎన్నికల సంఘం, SIR ప్రక్రియను తప్పుబట్టడం అలవాటుగా మారిందని విమర్శించారు.

దేశంలో 13 కోట్ల ఓట్లు తొలగించారన్న కాంగ్రెస్ ఆరోపణలు అవాస్తవమని, ప్రస్తుతం ఉన్నది ముసాయిదా ఓటర్ల జాబితా మాత్రమేనని స్పష్టం చేశారు. ఇందులో 2.8 కోట్ల మంది మరణించిన ఓటర్లు, కోటి మందికి పైగా డూప్లికేట్ ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. మరో 6.30 కోట్ల మంది శాశ్వతంగా వలస వెళ్లి ఆచూకీ తెలియకుండా ఉన్నారని తెలిపారు.

తెలంగాణలోనూ 18.07 లక్షల మంది మరణించగా, 6.70 లక్షల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని చెప్పారు. ఇలాంటి పేర్లను తొలగించకూడదా అని ప్రశ్నించారు. ఓటర్ల జాబితాలో పేరు తొలగినా సరైన ఆధారాలతో తిరిగి నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ముందుగా 1984లో సిక్కుల ఊచకోత ఘటనపై బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలు రాజకీయ ఆరోపణల కంటే వాస్తవాలను పరిశీలించాలని బండి సంజయ్ కోరారు.

చనిపోయిన వారి ఓట్లు తొలగించాలా? వద్దా?

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ముద్ర, హైదరాబాద్: దేశంలో 13కోట్ల మంది ఓట్లను తొలగించారని చెబుతున్న కాంగ్రెస్.. వాస్తవాలు ఎందుకు చెప్పడం లేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. అందులో 2.8 కోట్ల మంది ఓటర్లు చనిపోయారు, వాటిని తొలగించాలా? వద్దా? అని ప్రశ్నించారు. దేశంలో 6.30 కోట్ల ఓటర్లు శాశ్వతంగా వలస వెళ్లారని, ఎక్కడున్నారో తెలియదని.. వాళ్లకు ఎన్నికల సంఘం నోటీసులిచ్చినా స్పందించడం లేదని తెలిపారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే 6.30 కోట్ల ఓటర్ల ఆచూకీ కనిపెట్టి ఆధారాలు సమర్పించాలని డిమాండ్ చేశారు. మరణించిన వాళ్లను, దొంగ ఓట్లను, ఆచూకీ లేని వలస ఓట్లను ఓటర్ జాబితాలో చేర్చాలని కాంగ్రెస్ ధర్నాలు చేస్తోందా? అని కిషన్ రెడ్డి మండిపడ్డారు. పాతబస్తీ, మహేశ్వరం నియోజకవర్గాల్లో 2014కు ముందు పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్ సహా విదేశాల నుంచి అక్రమంగా వలస వచ్చిన వేల మంది ఓట్లున్నాయని, వాటిని తొలగించాలా? వద్దా? ప్రజలే ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 2004లో చనిపోతే ఆయన ఓటు ఇంకా ఉందని, ఆ ఓటును తొలగించాలా వద్దా అని మరో కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ఓడిపోతే ఈవీఎంలపైనా విష ప్రచారం చేయడం కాంగ్రెస్‌కే చెల్లిందని దుయ్యబట్టారు.

రామంతాపూర్‌లోని పెద్ద చెరువు పరిధిలో హైడ్రా కూల్చివేతలు

ముద్ర, రామంతాపూర్: హైదరాబాద్ రామంతాపూర్‌లోని పెద్ద చెరువు పరిధిలో హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న భారీ షెడ్‌ను తొలగించారు. అయితే, గత 40 ఏళ్లుగా పన్నులు, విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నామని, ఇన్నేళ్ల తర్వాత తమ ఆస్తిని కూల్చివేయడం బాధాకరమని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా అధికారులు సర్వే కోసం వస్తుండటంతో తాము హైకోర్టును ఆశ్రయించామని తెలిపారు. ముందుగా చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులను స్పష్టంగా నిర్ధరించిన తర్వాతే చర్యలు తీసుకోవాలని చెప్పినా.. ఫలితం లేకపోయిందని వాపోయారు. చట్టబద్ధంగా ఉన్న భూముల విషయంలో ప్రభుత్వం నిబంధనల ప్రకారం.. సరైన ప్రక్రియను అనుసరించిన తర్వాతే చర్యలు చేపట్టాలని యజమానులు విజ్ఞప్తి చేస్తున్నారు. దశాబ్దాలుగా పన్నులు చెల్లిస్తున్న తమ ఆస్తిపై ఇప్పుడు చర్యలు తీసుకోవడం అన్యాయమని ఆరోపిస్తున్నారు.

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు రూ.42.5 లక్షల సీఎస్‌ఆర్ నిధులు

పోలీసు సిబ్బంది పిల్లల విద్యాభివృద్ధికి కార్పొరేట్ సంస్థల చేయూత
డీజీపీ సీవీ ఆనంద్‌కు విరాళాల చెక్కులు అందజేత

ముద్ర, హైదరాబాద్ : పోలీసు సిబ్బంది పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ (వైఐపీఎస్)కు మూడు కార్పొరేట్ సంస్థలు రూ.42.5 లక్షల కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) నిధులను విరాళంగా అందించాయి. కోహినూర్ గ్రూప్‌కు చెందిన ఏక్యూ స్క్వేర్ రియల్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.25 లక్షల విరాళాన్ని అందించింది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ అహ్మద్ ఖాద్రీ తరఫున ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మహమ్మద్ అమ్జద్, ఆయన కుమారుడు మహమ్మద్ నిసార్ ఖాద్రీ ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును డీజీపీ సీవీ ఆనంద్‌కు అందజేశారు.అలాగే పుజ్లోలానా మెషినరీ ఫ్యాబ్రికేషన్స్ ఎల్‌ఎల్‌పీ, ఆర్యన్ ప్రెసిషన్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున మేనేజింగ్ డైరెక్టర్ ఆదిత్య పాయ్ రూ.10 లక్షల విరాళాన్ని అందించారు. దీవ్యశక్తి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వ్యవస్థాపక డైరెక్టర్ రవీంద్ర కుమార్ అగర్వాల్ రూ.7.5 లక్షల విరాళాన్ని అందజేశారు.

పోలీసు సిబ్బంది సమాజానికి అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ, వారి పిల్లల విద్యాభివృద్ధికి తోడ్పడాలనే ఉద్దేశంతో ఈ విరాళాలు అందించినట్లు సంస్థల ప్రతినిధులు తెలిపారు.

విద్యాభివృద్ధికి ఉదారంగా సహకరించిన సంస్థల ప్రతినిధులను డీజీపీ సీవీ ఆనంద్ అభినందించారు. పోలీసు కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు కార్పొరేట్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు.యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు అందిన ఈ సీఎస్‌ఆర్ నిధులు పోలీసు సిబ్బంది పిల్లల విద్యాభివృద్ధికి మరింత తోడ్పడనున్నాయి.

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక నిధులు

- ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు ప్రభుత్వం రూ.120 కోట్ల మంజూరు
- సింగూరు ప్రత్యామ్నాయ తాగునీటి అవసరాలకు రూ.120 కోట్లు.. -
- ఇతర జిల్లాలకు రూ.కోటి చొప్పున కేటాయింపు
- ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తం.. అధికారులతో మంత్రి సీతక్క టెలీకాన్ఫరెన్స్

ముద్ర, హైదరాబాద్ : ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ప్రత్యామ్నాయ తాగునీటి ఏర్పాట్ల కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసింది. సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో సింగూరు ప్రత్యామ్నాయ తాగునీటి అవసరాల కోసం రూ.120 కోట్లు, ఇతర జిల్లాల్లో తక్షణ అవసరాల నిమిత్తం ఒక్కో జిల్లాకు రూ.కోటి చొప్పున నిధులు కేటాయించినట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క వెల్లడించారు.

శనివారం ఉదయం మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి సరఫరా పరిస్థితిని మంత్రి సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలను ముందుగానే అంచనా వేసి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

నీటి కొరత ఎదురయ్యే ప్రాంతాల్లో స్థానిక నీటి వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. అవసరమైన చోట బోరుబావులను అద్దెకు తీసుకోవడంతో పాటు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు రవాణా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. చేతిపంపులు, సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ నీటి సరఫరా పథకాలు, బావులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడే గ్రామాలు, భూగర్భ జలాలు అడుగంటిన ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ఆయా ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

నీటి పొదుపు, ఎల్‌నినో ప్రభావంపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని మంత్రి సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.

ఇటీవల హైదరాబాద్, మేడ్చల్, ఖమ్మం, యాదాద్రి తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీటిని భూగర్భ జలాల పెంపునకు వినియోగించుకోవాలని సూచించారు. తాగునీటి వనరుల వద్ద ఇప్పటికే నిర్మించిన ఇంకుడు గుంతలు, మ్యాజిక్ పిట్లలోకి వర్షపు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని, పురోగతిలో ఉన్న నిర్మాణాలను రెండు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ టెలీకాన్ఫరెన్స్‌లో మిషన్ భగీరథ ఇంజనీర్ ఇన్ చీఫ్ కృపాకర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్లు, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ విభాగాల సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

పారిశ్రామికాభివృద్ధి, నైపుణ్య మానవ వనరులే ఆర్థిక ప్రగతికి కీలకం

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం: మంత్రి వివేక్ వెంకటస్వామి

ముద్ర, హైదరాబాద్: 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. ఈ లక్ష్య సాధనకు పారిశ్రామికాభివృద్ధి, నైపుణ్య మానవ వనరుల తయారీ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కీలకమని పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు.హైదరాబాద్‌లో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ స్వర్ణోత్సవాల సందర్భంగా నిర్వహించిన జాతీయ సదస్సులో మంత్రి పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలోని 65 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేశామని, ఇందుకోసం సుమారు రూ.4 వేల కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది మరో 54 కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా ఏఐ, ఆధునిక సాంకేతికత కారణంగా ఉద్యోగ రంగంలో మార్పులు వస్తున్నాయని, యువత నిరంతరం కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాలని సూచించారు. జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో పెరుగుతున్న నైపుణ్య కార్మికుల డిమాండ్‌ను భారత యువత అవకాశంగా మలుచుకోవాలని అన్నారు. విదేశీ ఉద్యోగాల కోసం సాంకేతిక నైపుణ్యాలతో పాటు స్థానిక భాష, పని సంస్కృతిపై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. పరిశ్రమలు కోరుకునే నైపుణ్యాలకు, విద్యాసంస్థల్లో అందించే శిక్షణకు మధ్య అంతరాన్ని తగ్గించడం ద్వారా యువతకు మెరుగైన భవిష్యత్తు కల్పించవచ్చని మంత్రి వివరించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
ఆదివారం, 01 నవంబర్, 2026
4
వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సప్ నం.: 9849623744
మేయిల్: mudradaily@gmail.com

ఏఐకేఎస్ జాతీయ మహాసభలు

'నల్లగొండ' పేరు వినగానే గుర్తుకొచ్చేది పోరాటాల చరిత్రే! నిరంకుశత్వాన్ని ఎదిరించి, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా సమరశంఖం పూరించిన వీరుల త్యాగాలకు ఈ నేల సజీవ సాక్ష్యం. ఇక్కడి ప్రతి పల్లె, వీచే గాలి, త్రాగే నీరు పండిన ప్రతి గింజ ఎర్రజెండా ఉద్యమాల చరిత్రను గుర్తుచేస్తాయి. పోరాటాల గడ్డగానే కాకుండా ప్రాచీన కట్టడాలు, విశిష్ట సాంస్కృతిక వారసత్వంతోనూ నల్లగొండ జిల్లా ప్రత్యేక గుర్తింపు పొందింది.

ప్రపంచ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం. 'భూమి కోసం.. భుక్తి కోసం.. విముక్తి కోసం' నైజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన ఈ మహాసంగ్రామంలో కమ్యూనిస్టు పార్టీ అగ్రభాగాన నిలిచింది. నాలుగు వేల మంది అమరుల త్యాగాలతో, మూడు వేల గ్రామాలను భూస్వామ్య వ్యవస్థ నుంచి విముక్తి చేసి, పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత ఎర్రజెండాది . ఆ విప్లవ చైతన్యానికి నల్లగొండ కేంద్ర బిందువుగా నిలిచింది. సాయుధ పోరాటం నుంచి స్వరాష్ట్ర సాధన వరకు ప్రతి ఉద్యమంలో నూ తన పోరాట పటిమను చాటిన ఈ గడ్డపై ఇప్పుడు మరో చారిత్రక ఘట్టం ఆవిష్కృతం కానుంది.

గడుగోజు రవీంద్రాచారి
జర్నలిస్టు, 9848772232

తెలంగాణ రాష్ట్రంలోని నల్లగొండ జిల్లా కేంద్రంలో తొలిసారిగా నవంబర్ 15 నుంచి 18 వరకు 36వ అఖిల భారత కిసాన్ జాతీయ మహాసభలు జరగనున్నాయి.

నాడు నైజాం నిరంకుశత్వంపై బందూకులు ఎత్తిన ఈ పోరాట నేలపై, నేడు రైతాంగం ఎదుర్కొంటున్న సంక్షోభాలు, హక్కుల పరిరక్షణపై దేశవ్యాప్త చర్చకు వేదిక సిద్ధమవుతోంది. అమరవీరుల త్యాగాలతో పునీతమైన ఈ గడ్డ నుంచి పెల్లుబికే కిసాన్ సమరభేరి దేశ రైతాంగ ఉద్యమానికి నూతన దిశానిర్దేశం చేయబోతుంది.

తొమ్మిది దశాబ్దాల రైతాంగ పోరాట ప్రస్థానం 1936లో బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా ఆవిర్భవించిన అఖిల భారత కిసాన్ సభ తొమ్మిది దశాబ్దాలుగా అన్నదాతల హక్కుల కోసం నిరంతరం పోరాడుతోంది. మరోవైపు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి 80 ఏళ్ల చారిత్రక సందర్భం తోడవడంతో ఈ మహాసభల ప్రాధాన్యత మరింత పెరిగింది. నిజాం నిరంకుశ పాలన, భూస్వాముల దోపిడీ, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా సాగిన పోరాటంలో సుమారు నాలుగు వేల మంది ప్రాణత్యాగం చేశారు. మూడు వేల గ్రామాలకు విముక్తి లభించగా, పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేశారు. దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ వంటి ఎందరో వీరుల పోరాటాలు తరతరాలకు స్ఫూర్తిగా నిలిచాయి. అటువంటి ఘనమైన చరిత్ర కలిగిన తెలంగాణలోని నల్లగొండ జిల్లా కేంద్రంలో జాతీయ రైతు మహాసభలు నిర్వహించడం నాటి త్యాగాలకు నివాళి అర్పించడమే కాకుండా, భవిష్యత్ పోరాటాలకు గొప్ప స్ఫూర్తినివ్వనుంది.

అప్పుల ఊబిలో అన్నదాత..
ఆగని వ్యవసాయ సంక్షోభం

దేశానికి అన్నం పెట్టే రైతన్న నేడు తీవ్రమైన అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నాడు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, డీజిల్, కూలీల ఖర్చులు విపరీతంగా పెరిగాయి. ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలు, కరువులు, తెగుళ్లు పంటలను కోలుకోలేని విధంగా దెబ్బతీస్తున్నాయి. పండించిన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రాని దుస్థితి నెలకొంది. అప్పుల భారం తట్టుకోలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న విషాదం వ్యవసాయ రంగ సంక్షోభ తీవ్రతకు అద్దం పడుతోంది.

ఈ పరిస్థితుల్లో రైతులకు అండగా నిలవాల్సిన కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. వ్యవసాయ రంగాన్ని స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు ధారపోసే ప్రయత్నాలు వేగంగా జరుగుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. విదేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ప్రతికూల ప్రభావం దేశీయ రైతులపై తీవ్రంగా పడే ప్రమాదం ఉంది. పత్తి దిగుమతులపై సుంకాల తగ్గింపు, వంట నూనెల దిగుమతులను ప్రోత్సహించే నిర్ణయాలు దేశీయ పత్తి, నూనెగింజల రైతుల ప్రయోజనాలకు గొడ్డలిపెట్టుగా మారాయి. విదేశీ ఉత్పత్తులతో పోటీపడలేక దేశీయ పంటలకు ధరలు పడిపోతుండటంతో రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది.

మద్దతు ధరకు చట్టబద్ధత ఏదీ?

కేంద్రం 22 పంటలకు కనీస మద్దతు ధర ప్రకటిస్తున్నప్పటికీ, ఏ పంటకూ పూర్తిస్థాయి కొనుగోలు హామీ లేదు. గోధుమలు, వరి ఉత్పత్తిలో సగం కంటే తక్కువ పరిమాణమే ప్రభుత్వ సేకరణకు వస్తోంది. మిగిలిన పంటలను రైతులు ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరలకే విక్రయించుకొని నష్టపోతున్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు ఉత్పత్తి వ్యయంపై 50 శాతం లాభం కలిపి అన్ని పంటలకూ గిట్టుబాటు ధర కల్పించాలని రైతాంగం డిమాండ్ చేస్తోంది. దీనికి చట్టబద్ధ హామీ ఇవ్వడంతోపాటు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను విస్తరించాల్సి ఉంది.

ఢిల్లీ సరిహద్దుల్లో సాగిన చారిత్రక రైతాంగ ఉద్యమం మూడు నల్ల వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకునేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చింది. అయితే ఆందోళన విరమణ సందర్భంగా ఇచ్చిన కనీస మద్దతు ధర చట్టబద్ధత తదితర హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదు. విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణ యత్నాలు కూడా రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతుల హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్త ఐక్య ఉద్యమాలు అనివార్యంగా మారాయి.

తెలంగాణ రైతాంగాన్నీ వెంటాడుతున్న సమస్యలు

మరోవైపు తెలంగాణలోనూ రైతాంగం అనేక సమస్యలతో సతమతమవుతోంది. రుణమాఫీ అమలులో లోపాలు, రైతు భరోసా నిధుల జాప్యం, కౌలు రైతులకు గుర్తింపు లేకపోవడం, సాగునీటి కొరత, పంటల కొనుగోళ్లలో అవాంతరాలు అన్నదాతలను వెంటాడుతున్నాయి. పంట నష్టపోయిన వారికి పరిహారం సకాలంలో అందడం లేదు. సాగు ఖర్చులన్నీ భరించే కౌలు రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు దక్కడం లేదు. రైతుల సమస్యలను కేవలం రాజకీయ హామీలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో పరిష్కరించాల్సిన అవసరం ఉంది. వ్యవసాయ కార్మికులకు ఉపాధి భద్రత, మహిళా రైతులకు గుర్తింపు, కౌలు రైతులకు చట్టబద్ధ హక్కులు కల్పించాల్సి ఉంది.

28 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు

ఈ తరుణంలో కోటి 58 లక్షల మంది సభ్యులతో దేశంలోనే అతిపెద్ద రైతు సంఘంగా కొనసాగుతున్న అఖిల భారత కిసాన్ సభ మహాసభలకు 28 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 1,200 మందికి పైగా ప్రతినిధులు హాజరవుతున్నారు. గత మూడున్నరేళ్లలో దేశవ్యాప్తంగా జరిగిన రైతు ఉద్యమాలు, వాటి విజయాలు, ఎదురైన సవాళ్లపై సుదీర్ఘంగా సమీక్షించడంతోపాటు రాబోయే మూడేళ్లకు అవసరమైన బృహత్తర కార్యాచరణను ఈ మహాసభలు స్పష్టంగా రూపొందించనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలు, వాణిజ్య ఒప్పందాల ప్రభావం, కనీస మద్దతు ధర చట్టబద్ధత, రైతుల రుణ విముక్తి, విద్యుత్ ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటం, కౌలు రైతుల సమస్యలపై ఇక్కడ చర్చించనున్నారు.

ఈ చారిత్రక మహాసభల్లో ఆమోదించే కీలక తీర్మానాలు గ్రామస్థాయి నుంచి ఢిల్లీ వరకు రైతాంగ ఉద్యమాలను మరింత సమర్థవంతంగా బలోపేతం చేయనున్నాయి. రైతులను సంఘటితం చేస్తూ కార్మికులు, విద్యార్థులు, యువత, మహిళా శక్తులను కలుపుకొని బలమైన పోరాటాలకు ఇవి శ్రీకారం చుట్టబోతున్నాయి. పాలకుల విధానాల్లో స్పష్టమైన మార్పు తెచ్చేలా నిరంతర ప్రజా పోరాటాల ప్రణాళికలను ఇక్కడ ఆవిష్కరించనున్నారు. దేశవ్యాప్తంగా కార్మిక, కర్షక వర్గాల ఐక్యతను చాటుతూ భవిష్యత్ సమరానికి ఈ మహాసభలు సన్నద్ధమవుతున్నాయి. గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేస్తూ నల్లగొండ మహాసభలు సమరశీల ఉద్యమాలకు దిక్సూచిగా నిలవబోతున్నాయి.

ఎర్రజెండాలతో నల్లగొండలో రైతు కదనోత్సాహం

మహాసభల ప్రారంభ సూచికగా నవంబర్ 15న నల్లగొండ ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు లక్షలాది మంది రైతులు కదం తొక్కనున్నారు. వేలాది మంది యువ కార్యకర్తలతో నిర్వహించే 'రెడ్ మార్చ్' నల్లగొండ నడిబొడ్డున ఎర్రజెండాల శోభను సంతరించుకోనుంది. నవంబర్ 14 నుంచి 17 వరకు వ్యవసాయ ప్రదర్శన, మూడు రోజులపాటు సాగే సాంస్కృతిక ఉత్సవాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

దేశవ్యాప్త రైతు నాయకులు పాల్గొనే ఈ మహాసభ రైతాంగ ఐక్యతను ప్రపంచానికి చాటనుంది. "ప్రతి పల్లె నుంచి ఇంటికో మనిషి.. ఊరికో బండి"గా నల్లగొండ బహిరంగ సభకు రావాలన్న పిలుపుతో అన్నదాతలు సమరానికి సన్నద్ధమవుతున్నారు. ఎర్ర చొక్కాలు ధరించి, ఎర్రజెండాలు చేతబూని నల్లగొండను మరోసారి 'ఎర్రగొండ'గా మార్చబోతున్నారు. దీంతో విప్లవాల ఖిల్లాగా నల్లగొండ పేరు మరోసారి మారుమోగనుంది.

మహాసభల విజయానికి విస్తృత ఏర్పాట్లు

ఈ మహాసభలను జయప్రదం చేసేందుకు ఆహ్వాన సంఘం అహర్నిశలూ శ్రమిస్తోంది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ, ప్రత్యేకించి ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రతి రైతుకూ, ప్రతి ఇంటికీ సభల సమాచారాన్ని చేరవేసి విజయవంతం చేయాలని అభ్యర్థించారు. గోడ రాతలు, పోస్టర్ల ప్రదర్శన, కరపత్రాల పంపిణీతోపాటు సామాజిక మాధ్యమాల వేదికగానూ ముమ్మరంగా ప్రచారం సాగిస్తున్నారు. సభలకు ఊపునిచ్చేందుకు తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రజానాట్యమండలి సహకారంతో 'మట్టిపూల పరిమళాలు' రైతాంగ పోరాట గీతాలు పేరిట వివిధ రచయితలు రాసిన పాటల సీడీని కూడా ఆవిష్కరించారు.

నల్గొండ ఎర్రగొండగా

మహాసభల నేపథ్యంలో నల్లగొండ పట్టణమంతా ఎర్ర తోరణాలు, ఎర్రజెండాలు, స్వాగత బ్యానర్లు, ఫ్లెక్సీలతో అరుణమయంగా మారిపోతోంది. క్లాక్‌టవర్ సెంటర్‌లో రైతులకు ఉపయోగపడేలా 3 రోజుల పాటు ప్రత్యేక ఎగ్జిబిషన్, వివిధ రకాల స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. దేశ నలుమూలల నుంచి వచ్చే ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా సౌకర్యాలు కల్పించారు. 4 రోజుల పాటు నల్లగొండ జిల్లాలో రైతు పండగను తలపించేలా అంగరంగ వైభవంగా జరగనున్న ఈ మహాసభలపైనే ఇప్పుడు అందరి దృష్టి నిలిచింది.

రైతాంగ పోరాటాలకు మరోసారి సమరశంఖం

రైతు లేనిదే రాజ్యం లేదు.. రైతు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుంది. నాటి వీర తెలంగాణ రైతాంగ పోరాట స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ఈ మహాసభలు ప్రధాన పోరాట వేదికగా నిలవనున్నాయి. ప్రభుత్వాల మెడలు వంచే సమరశీల కార్యాచరణను ఇక్కడి నుంచే ప్రకటించబోతున్నారు. నవంబర్ 15న జరిగే ఈ భారీ బహిరంగ సభకు రైతులు, మహిళలు, యువకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయనున్నారు. పాలకవర్గాలకు కనువిప్పు కలిగిస్తూ.. 'రైతులకు అండ ఎర్రజెండా' అని ఈ నేల మరోసారి స్పష్టంగా చాటిచెప్పబోతోంది.

బొనియన్

బొటనవేలు బొటనవేలు యొక్క వైకల్యం. బొటన వ్రేలి మొదట్లో బొటన వ్రేలి మొదట్లో బొటన వ్రేలి మొదట్లో బొటన వ్రేలి మొదట్లో బొటన వ్రేలి మొదట్లో బొటన వ్రేలి మొదట్లో బొటన వ్రేలికి ఒక బొటనవేలు ఉంటుంది. పాదం లోపలి భాగంలో ఒక లక్షణం బంప్ కూడా ఉంది. బొటన వ్రేలి మొదట్లో బొటన వ్రేలి మొదట్లో బొటన వ్రేలి మొదట్లో ఉబ్బు నొప్పి అభివృద్ధి చెందుతుంది. ఫుట్ బొటన వ్రేలి మొదట్లో బొటన వ్రేలి మొదట్లో ఉబ్బుకు సంబంధించిన వైద్య పదం హాలక్స్ వాల్గస్.

కారణాలు

పాదాలలో సంభవించే సంక్లిష్ట బయోమెకానికల్ మార్పుల ఫలితంగా బొటన వ్రేలికలు ఏర్పడతాయి. ఒక వ్యక్తి ధరించే పాదరక్షల రకం బొటన వ్రేలికి కారణమవుతుంది. చాలా పాశ్చాత్య దేశాల జనాభాలో 30% మందిలో ఫుట్ బనియన్లు సంభవిస్తాయి, అయితే తూర్పు దేశాలలో కేవలం 3% మాత్రమే. అవి మహిళల్లో సర్వసాధారణంగా కనిపిస్తాయి మరియు ప్రజలు పెద్దయ్యాక సర్వసాధారణంగా మారతారు.



బిగుతుగా ఉండే బూట్లు బనియన్లకు ప్రధాన కారణమని భావిస్తున్నారు. టైట్ టో బాక్సలు (ఉదా – మహిళల ఫ్యాషన్ షూస్ మరియు కౌబాయ్ బూట్లు) ఉన్న హైహీల్స్ మరియు షూస్ వంటి షూలు ముఖ్యంగా కాలి వేళ్లకు హాని కలిగిస్తాయి. ఈ బూట్లు వాలుగా ఉండే ఫుట్ బెడ్, ఇరుకైన బొటనవేలు పెట్టెను కలిగి ఉంటాయి.

వాలు పాదాల ముందు భాగం శరీర బరువును మోయడానికి కారణమవుతుంది, ఇది ముందరి పాదాలను వెడల్పు చేయడానికి ప్రోత్సహిస్తుంది. అలాగే, కోణం ఇరుకైన బొటనవేలు పెట్టెలోకి కాలి వేళ్లను నెట్టివేస్తుంది, దీనివల్ల కాలి కోణాలుగా మారతాయి మరియు కలిసి పిండుతాయి. నిర్బంధ పాదరక్షలను ఎక్కువసేపు ధరించడం వల్ల, కాలి కొత్త స్థానానికి అనుగుణంగా మరియు వైకల్యానికి దారి తీస్తుంది.

పాదరక్షలు బొటన వ్రేలికి మాత్రమే కారణం కాదు. పాదానికి గాయాలు కూడా బొటన వ్రేలి మొదట్లో ఉబ్బును అభివృద్ధి చేయడానికి ఒక కారణం కావచ్చు. చదునైన పాదాలు లేదా ఫుట్ ఓవర్‌ప్రొనేషన్‌కు దారితీసే పేలవమైన ఫుట్ ఆర్చ్ నియంత్రణ ఒక వ్యక్తి బయోమెకానికల్‌ను ఫుట్ బనియన్‌లకు గురి చేస్తుంది.

బొటన వ్రేలికి సంబంధించిన కుటుంబ చరిత్ర కూడా బొటన వ్రేలి మొదట్లో ఉబ్బులు అభివృద్ధి చెందే అవకాశాన్ని పెంచుతుంది.

చాలా మంది వ్యక్తులు ఈ పరిస్థితికి గురయ్యే కారకాల కలయికను కలిగి ఉంటారు.

ఉదా – నలభై ఏళ్లు పైబడిన మహిళలు బనియన్ల కుటుంబ చరిత్రను కలిగి ఉన్నట్లయితే మరియు తరచుగా ఎత్తు మడమలు ఉన్న బూట్లు ధరిస్తే, బొటన వ్రేలి మొదట్లో బొటన వ్రేలికి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

నివారణ

జాగ్రత్తగా బూట్లు ఎంచుకోండి. అవి వెడల్పుగా ఉండే బొటనవేలు పెట్టెని కలిగి ఉండాలి – పాయింటీ కాలి ఉండకూడదు – మరియు మీ పొడవాటి బొటనవేలు కొన మరియు షూ చివర మధ్య ఖాళీ ఉండాలి.

మీ పాదరక్షలు మీ పాదంలోని ఏదైనా భాగాన్ని పిండకుండా లేదా నొక్కకుండా మీ పాదాల ఆకృతికి అనుగుణంగా ఉండాలి.

సీతాఫలం సహజంగా పండిందా?

చలికాలం వచ్చిందంటే మార్కెట్లలో నోరూరించే సీతాఫలాలు మార్కెట్లలో ఎక్కువగా కనిపిస్తాయి. సీతాఫలాన్ని చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరు ఇష్టంగా తింటుంటారు. అయితే, మార్కెట్లలో డిమాండ్‌ను క్యాష్ చేసుకునేందుకు కొందరు వ్యాపారులు కాయల్ని సహజంగా చెట్టు మీద పక్వానికి రానివ్వకుండా.. కాల్షియం కార్బైడ్ లేదా ఎథిఫాన్ వంటి ప్రమాదకర రసాయనాల్ని వాడి రాత్రికి రాత్రే కృత్రిమంగా పండిస్తున్నారు.

కార్బైడ్ వాడకం వల్ల ఎసిటిలీన్ గ్యాస్ విడుదలై పండు పైకి పండినట్లు కనిపించినా, లోపల ఆర్సెనిక్, ఫాస్ఫరస్ వంటి హానికర రసాయన అవశేషాలు మిగిలిపోతాయి. వీటిని తినడం వల్ల కడుపునొప్పి, వాంతులు, నాడీ సమస్యల నుంచి దీర్ఘకాలంలో క్యాన్సర్ వచ్చే ప్రమాదం కూడా ఉంది. అందుకే సీతాఫలం కొనేటప్పుడు అది సహజమైనదా లేక రసాయనాలతో పండించినదా అనేది గుర్తించడం చాలా ముఖ్యం. సహజంగా పండిందో లేదో తెలుసుకునే చిట్కాల గురించి తెలుసుకుందాం.

కళ్ళ పరిమాణం, గీతల రంగు

సీతాఫలం సహజంగా పండినప్పుడు దాని పైనున్న కళ్ళు బాగా విచ్చుకుంటాయి. 2 కళ్ళ మధ్య ఉండే ఖాళీల్లో తెల్లటి లేదా లేత పసుపు రంగు గీతలు స్పష్టంగా కనిపిస్తాయి. అదే రసాయనాలతో పండించిన కాయల్లో కళ్ళు దగ్గరగానే నొక్కుకుని ఉంటాయి, సరిగ్గా విచ్చుకోవు. కాయ పూర్తిగా పచ్చగా లేదా ఆకుపచ్చగా ఉన్నప్పుడే బలవంతంగా మగ్గించడం వల్ల కళ్ళ మధ్య తెల్లటి సహజ రంగు రాదు.

తాకినప్పుడు మెత్తదనం

సహజంగా పండిన సీతాఫలాన్ని చేతితో మెల్లగా నొక్కితే పండు అంతా సమానంగా మెత్తగా తగులుతుంది. కానీ రసాయనాలు చల్లిన పండ్లను పరిశీలిస్తే, బయటి తొక్క మెత్తబడిపోయి గుజ్జు ఉన్న భాగం లోపల గట్టిగా రాయిలా ఉంటుంది. బయట చేతికి పండినట్లు అనిపించినా, విరిచి చూస్తే లోపల సరిగ్గా పండని పచ్చి గింజలు, గట్టి గుజ్జు కనిపిస్తాయి.

సహజ సువాసన VS ఘాటైన రసాయన వాసన

చెట్టుపై లేదా గడ్డిలో సహజంగా పండిన సీతాఫలానికి తియ్యటి, ఆహ్లాదకరమైన సువాసన ఉంటుంది. ఆ పండును ముక్కు దగ్గర పెట్టుకోగానే సహజమైన పండ్ల వాసన గుబాళిస్తుంది. రసాయనాలు వేసిన పండ్లకు ఎలాంటి సహజ సువాసన ఉండదు; కొన్నిసార్లు ఘాటైన రసాయన లేదా గ్యాస్ వాసన (ఆల్కహాల్ లేదా కిరోసిన్ వాసనను పోలి) వస్తుంది.

తొక్కపై తెల్లటి పొడి, నల్ల మచ్చలు

కార్బైడ్ వంటి పొడులను ఉపయోగించినప్పుడు పండ్ల తొక్కపై లేదా తొడిమల దగ్గర తెల్లటి లేదా బూడిద రంగు పౌడర్ అవశేషాలు అంటుకుని కనిపిస్తాయి. అలాగే రసాయనాలతో పండిన పండ్లు కొన్ని కొద్ది గంటల్లోనే తొక్క నల్లబడి కుళ్ళిపోవడం మొదలవుతుంది. సహజ పండు పసుపు –ఆకుపచ్చ వర్ణంలో మెరుస్తూ క్రమంగా మాత్రమే ముదురు రంగులోకి మారుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్త: మార్కెట్ లో బాగా మెత్తబడిన పండ్లను కొనే బదులు, కళ్ళు బాగా విచ్చుకుని తెల్లటి గీతలు కనిపిస్తున్న దోర కాయల్ని కొనుగోలు చేయడం ఉత్తమం. వాటిని ఇంట్లోనే పేపర్‌లో చుట్టి బియ్యం డబ్బాలో లేదా గోనె సంచిలో పెడితే ఒకటి లేదా రెండు రోజుల్లో ఎటువంటి హాని లేకుండా సహజంగా, తియ్యగా మగ్గుతాయి.

సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

ఆదివారం 01.11.2026

www.mudranews.in | @mudranews

కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేయండి

భోజన సమయాన్ని కుటుంబ సభ్యులతో గడిపేందుకు ఉపయోగించుకోండి. ఫోన్లను పక్కన పెట్టి ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం వల్ల కుటుంబ బంధాలు బలపడటంతో పాటు మానసిక సంతృప్తి లభిస్తుంది.

జాతీయ సమైక్యత పరిరక్షణకు కృషి చేయాలి

హైడ్రా కార్యాలయంలో..


సర్దార్ పటేల్ నగర్‌లో..

జేఎన్‌టీయూ ప్రాంగణంలో..

మెదక్‌లో..

డీజీపీ కార్యాలయంలో రాష్ట్రీయ ఏక్తా దివస్

ముద్ర, హైదరాబాద్: దేశ సమైక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మల్టీజోన్–1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని శనివారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో జాతీయ ఐక్యత దినోత్సవాన్ని (రాష్ట్రీయ ఏక్తా దివస్) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ (పీ అండ్ ఎల్) గజరావు భూపాల్ పోలీసు అధికారులు, సిబ్బందితో జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ సమైక్యత కోసం సర్దార్ వల్లభభాయ్ పటేల్ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. స్వాతంత్ర్యానంతరం సంస్థానాల విలీనంలో కీలక పాత్ర పోషించి దేశ ఐక్యతకు బలమైన పునాది వేశారని కొనియాడారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని జాతీయ సమైక్యత, సమగ్రత పరిరక్షణకు అందరూ పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐజీ (అడ్మిన్) అన్యోన్య, పలువురు పోలీసు అధికారులు, సీఏవోలు, ఏవోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హైడ్రా కార్యాలయంలో..

ముద్ర, హైదరాబాద్: భారతరత్న సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి వేడుకలను శనివారం హైడ్రా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ సమైక్యత, సమగ్రత కోసం పటేల్ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, దార్శనిక నాయకుడిగా దేశానికి ఆయన అందించిన సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. పటేల్ దూరదృష్టి, నిబద్ధత, దేశభక్తి నేటి తరాలకు ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో హైడ్రా అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య, అదనపు కమిషనర్లు ఆర్. సుదర్శన్, డి. ఆనంద్‌కుమార్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

సర్దార్ పటేల్ నగర్‌లో..

ముద్ర, కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని సర్దార్ పటేల్ నగర్‌లో జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వచ్ఛ భారత్ చైర్మన్, నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ని, ఎంపీ ఈటల రాజేందర్ ని మర్యాదపూర్వకంగా కలిసి జాతీయ ఐక్యత దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, భారత తొలి ఉప ప్రధాని, 'ఉక్కు మనిషి' సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని జాతీయ ఐక్యత దినోత్సవంగా జరుపుకోవడం ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం వందలాది సంస్థానాలను ఏకతాటిపైకి తెచ్చి అఖండ భారతదేశాన్ని నిర్మించడంలో పటేల్ పోషించిన పాత్ర అద్భుతమైనదని కొనియాడారు. దేశ సమగ్రత, సమైక్యత, సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, యువభారత్ ప్రతినిధులు, వివిధ కళాశాలల విద్యార్థి–విద్యార్థినులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ ప్రాంగణంలో..

ముద్ర, కూకట్‌పల్లి: భారత తొలి ఉప ప్రధాని, తొలి హోంమంత్రిగా పటేల్ దేశ నిర్మాణానికి విశేష కృషి చేశారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యానంతరం 500కు పైగా సంస్థానాలను ముఖ్యంగా హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేసి దేశ సమగ్రతను కాపాడిన మహోన్నత వ్యక్తి పటేల్ అని గుర్తుచేశారు. బారోలీ సత్యాగ్రహం ద్వారా రైతుల హక్కుల కోసం పోరాడిన ఆయన జీవితం, క్రమశిక్షణ, దేశభక్తి నేటి యువతకు ఆదర్శమని అన్నారు. విద్యార్థులందరూ కుల, మత, ప్రాంతీయ భేదాలు వీడి దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు మరియు విద్యార్థి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌లో..

ముద్ర ప్రతినిధి, మెదక్: సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలు, స్ఫూర్తితో దేశ ఐక్యత, సమగ్రత, భద్రత పరిరక్షణకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ మెంచు నగేష్ పేర్కొన్నారు. పటేల్ జయంతి, జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్లో నిర్వహించిన కార్యక్రమంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ సమైక్యత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు, కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యువజన క్రీడల శాఖ అధికారి రమేష్, ఏఓ యూనస్ తదితరులు పాల్గొన్నారు.

2కే రన్ ప్రారంభించిన అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్

ముద్ర ప్రతినిధి, మెదక్: దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా శనివారం మెదక్ పట్టణంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే రన్‌ను జెండా ఊపి స్వయంగా పాల్గొన్నారు. బోధన్ చౌరస్తా నుంచి రాందాస్ చౌరస్తా వరకు రన్ కొనసాగింది. పటేల్ స్వాతంత్ర్య సమరయోధుడిగా, స్వతంత్ర భారత తొలి ఉప ప్రధానిగా, హోంమంత్రిగా విశేష సేవలందించారని గుర్తుచేశారు. స్వాతంత్ర్యం అనంతరం 560కి పైగా సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేసి జాతీయ సమైక్యతకు బలమైన పునాది వేశారని తెలిపారు. ఆయన దూరదృష్టి, దృఢ సంకల్పం, నాయకత్వం నేటి తరానికి ఆదర్శమన్నారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ రంగనాథ్, సీఐలు మహేష్, కృష్ణమూర్తి, ఆర్ఐలు రామకృష్ణ, శైలేందర్, ఎస్సైలు, అగ్నివీర్ అభ్యర్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భువనగిరిలో సైబర్ సెక్యూరిటీ ఫ్లాష్ వాక్

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలో సైబర్ సెక్యూరిటీ ఫ్లాష్ వాక్ నిర్వహించారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు సైబర్ భద్రత, ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ లావాదేవీలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత సమాచార రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల మోసపూరిత వలలో పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్, సందేశాల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.సైబర్ నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ సైబర్ భద్రతా నియమాలు పాటిస్తూ ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని పోలీసులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భువనగిరి డీఎస్పీ రవీందర్, సీఐలు వెంకటేశ్వర్లు, చంద్రబాబు, సూర్య నాయక్, ఎస్ఐలు అనిల్, లక్ష్మీనర్సయ్యతో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి ఇద్దరు విద్యార్థుల మృతి

పోలీసు పెట్రోలింగ్ వాహనాన్ని చూసి పరుగులు తీస్తుండగా ప్రమాదం

ముద్ర, రంగారెడ్డి: రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. వ్యవసాయ పొలానికి ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి ఇద్దరు కళాశాల విద్యార్థులు మృతి చెందారు. మృతుల్లో మోహన్‌తో పాటు మరో విద్యార్థి ఉన్నారు.అందిన సమాచారం ప్రకారం.. కేజీ రెడ్డి కళాశాలలో నిర్వహించిన ఫెస్ట్ ముగిసిన అనంతరం సుమారు పది మంది విద్యార్థులు కలిసి సమీపంలోని వ్యవసాయ పొలాల్లోకి వెళ్లారు. అక్కడ మద్యం సేవిస్తున్న సమయంలో పోలీసు పెట్రోలింగ్ వాహనాన్ని గమనించి విద్యార్థులు పరుగులు తీసినట్లు సమాచారం. ఈ క్రమంలో రైతు రాజిరెడ్డి తన పొలానికి ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి మోహన్‌తో పాటు మరో విద్యార్థి ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది.ఈ ఘటనతో విద్యార్థుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, పొలంలో విద్యుత్ తీగల ఏర్పాటు తదితర అంశాలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పోలీసు సంక్షేమ నిధుల గోల్‌మాల్..

ఇద్దరు అరెస్టు హెడ్‌క్వార్టర్స్ ఖాతా నుంచి రూ.కోటి మళ్లింపు

ముద్ర, హైదరాబాద్: పోలీసు సంక్షేమ నిధుల మళ్లింపు వ్యవహారంలో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్‌లోని పేట్లబురుజు పోలీసు హెడ్‌క్వార్టర్స్ ఖాతా నుంచి సుమారు రూ.కోటి మాయం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వినయ్, మోసిన్‌లను అదుపులోకి తీసుకున్నారు. గత రెండేళ్లుగా పోలీసు సంక్షేమ నిధులపై వచ్చే వడ్డీ మొత్తాలను వీరిద్దరూ తమ సొంత ఖాతాల్లోకి మళ్లించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.పోలీసు హెడ్‌క్వార్టర్స్ అధికారుల అంతర్గత విచారణలో ఈ నిధుల మళ్లింపు వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. సంక్షేమ నిధుల ఖాతాల్లో అవకతవకలను గుర్తించిన అధికారులు విచారణ చేపట్టడంతో ఈ వ్యవహారం బయటపడింది. నిధుల మళ్లింపులో ఇంకా ఎవరైనా ప్రమేయం ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులకు ఘనంగా వీడ్కోలు

ముద్ర, శేరిలింగంపల్లి : సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో 2026 అక్టోబర్ 31 వ తేదీన కార్యాలయ ఆడిటోరియంలో పదవీ విరమణ పొందిన ఇద్దరు పోలీస్ అధికారులకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన అధికారులు తమ సుదీర్ఘ సేవా కాలంలో ప్రజలకు, పోలీస్ శాఖకు అందించిన విశిష్ట సేవలను కొనియాడారు. శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజా సేవ, నేర నియంత్రణతో పాటు శాఖ అభివృద్ధికి చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. వారి సేవాభావానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా జీవించాలని, తమ అనుభవాన్ని సమాజ శ్రేయస్సు కోసం వినియోగించాలని ఆకాంక్షించారు.పదవీ విరమణ పొందిన అధికారులు:మహమ్మద్ హాజీ మియా, ఎస్ఐ–1889, బాలానగర్ పోలీస్ స్టేషన్, జె. రవీందర్, ఏఎస్ఐ–883, రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ అధికారులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో డీసీపీ (అడ్మిన్) టి. అన్నపూర్ణ, స్పెషల్ బ్రాంచ్ డీసీపీ వై.వి.ఎస్. సుధీంద్ర, కార్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ పి. సంజీవ, జేఏఓ (బడ్జెట్) బి. నర్సింహారావు, ఎస్టేట్ ఆఫీసర్ ఆర్ఐ హిమాకర్, కో–ఆపరేటివ్ సొసైటీ ఇన్‌చార్జి ఎస్ఐ జి. మల్లేశం, సైబరాబాద్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు బి. శ్రీనివాస్, జి. గోపాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జె. మల్లేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ కె. శ్రీనివాస్, కో–ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ పి. అశోక్ తదితరులు పాల్గొన్నారు.అలాగే ఇతర డీసీపీలు, ఏసీపీలు, పోలీస్ అధికారులు, సైబరాబాద్ పోలీస్ అసోసియేషన్ సభ్యులు, కో–ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్లు, సిబ్బంది, పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు.

భారత ఉక్కు మహిళ ఇందిరా గాంధీకి నివాళి

ముద్ర, కూకట్‌పల్లి : దేశ ఐక్యతకు, సమగ్రతకు ప్రతీకగా నిలిచిన భారత మాజీ ప్రధానమంత్రి, ఉక్కు మహిళ స్వర్గీయ ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా న్యూఢిల్లీలోని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో నివాళులర్పించారు. కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ–బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి ఇందిరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు.ఈ సందర్భంగా పట్లోళ్ల నాగిరెడ్డి మాట్లాడుతూ.. దేశ అభివృద్ధికి, పేదల సంక్షేమానికి, మహిళా సాధికారతకు ఇందిరా గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆమె చూపిన ధైర్యసాహసాలు, నాయకత్వ పటిమ, త్యాగనిరతి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాచమల్ల శేఖర్ గౌడ్, అశోక్ ముదిరాజ్ తదితరులు పాల్గొని ఇందిరమ్మకు ఘన నివాళులర్పించారు.

మెదక్‌లో..

ముద్ర ప్రతినిధి, మెదక్: భారత మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరా గాంధీ వర్ధంతి మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందుగుల గంగాధర్ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలి మహిళా ఇందిరా గాంధీ కావడం దేశంలో ఉన్న మహిళా అందరూ గర్వించదగ్గ విషయమని, మహిళలు తలుచుకుంటే దేశాన్ని ఏలగలరని నిరూపించిన గొప్ప మహిళ నాయకురాలు ఇందిరా గాంధీ అని కొనియాడారు. కాంగ్రెస్ నాయకులు బుజ్జ పవన్, భూపతి రాజు, చింతల నర్సింలు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, కౌన్సిలర్లు గౌస్ కురేషి, అవారి రాజశేఖర్, జిల్లా మైనార్టీ సెల్ చైర్మన్ మహమ్మద్ సుఫీ, బాలరాజ్ యాదవ్, ఎండి ముజ్జం మిల్, దేవుల నాయక్, గాడి రమేష్, ఎండి షఫీ, సంఘ శ్రీకాంత్, రితీష్, నాగిరెడ్డి, పోచందర్, కొరివి రాములు, మమ్మద్ సఫి తదితరులు పాల్గొన్నారు.

సత్వరమే న్యాయం అందాలి

హై కోర్టు జడ్జి ప్రవీణ్ కుమార్

ముద్ర ప్రతినిధి, మెదక్: కక్షిదారులకి సత్వరమే న్యాయం అందాలని హై కోర్టు జడ్జి జి.ప్రవీణ్ కుమార్ అన్నారు.శనివారం మెదక్ జిల్లా నర్సాపూర్ లో ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వృత్తిలో ఉన్న న్యాయవాదులు ధర్మాన్ని పాటించాలి, అన్యాయాన్ని సహించొద్దన్నారు. బార్ అసోసియేషన్, బెంచ్ అన్నదమ్ముల అనుబంధాన్ని కొనసాగించాలన్నారు. న్యాయవాదులు డ్రెస్ కోడ్ పాటించి తమ వృత్తిని క్రమశిక్షణగా కొనసాగించాలన్నారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని, జీవితంలో అమ్మను మించిన గురువు లేరన్నారు. కక్షిదారుల సమస్యలన్నీ సామరస్యంగా పరిష్కరించాలని, నిష్పక్షంగా న్యాయం చేయాలన్నారు. మెదక్ జిల్లా న్యాయమూర్తి నీలిమ మాట్లాడుతూ.. నర్సాపూర్ పరిసర ప్రాంత ప్రజలకు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు చేయడం ద్వారా సత్వర న్యాయం జరుగుతుందన్నారు. జిల్లాలోని కోర్టు ప్రాంగణాల్లో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసి త్రాగునీటి ఇబ్బంది తీర్చాలని, కక్షిదారులకు మహిళా శక్తి క్యాంటీన్ ద్వారా అతి తక్కువ ధరలో భోజనం ఏర్పాటు చేయించాలని కలెక్టర్ ను కోరారు. ఈ సందర్భంగా కోర్టు ప్రాంగణంలో హై కోర్టు జడ్జి మొక్కను నాటి నీరు పోశారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతిమాసింగ్, ఎస్పీ డివి శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, న్యాయమూర్తులు శుభవల్లి, రూబీనా ఫాతిమా, సాయి ప్రభాకర్, సుచరిత, హేమలత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణలో న్యాయవాదులు కీలకపాత్ర పోషించాలి

న్యాయవాదుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలి

రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్, ఐలు రాష్ట్ర అధ్యక్షులు కొల్లి సత్యనారాయణ

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్య హక్కులను, న్యాయవ్యవస్థ స్వతంత్రతను పరిరక్షించడంలో న్యాయవాదులు ముందుండాలని రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్, ఐలు రాష్ట్ర అధ్యక్షులు కొల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం భువనగిరిలోని న్యూ వివేరా హోటల్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా రెండవ మహాసభల సందర్భంగా " రాజ్యాంగ పరిరక్షణ – న్యాయవాదుల పాత్ర " అనే అంశంపై సెమినార్ నిర్వహించారు.ఈ సెమినార్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాపాడటం న్యాయవాదుల బాధ్యత అని, సామాన్య ప్రజలకు సామాజిక న్యాయం అందేలా కృషి చేయాలని తెలిపారు. న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఐలు రాష్ట్ర అధ్యక్షులు కొల్లి సత్యనారాయణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని, సంక్షేమ నిధిని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. జూనియర్ న్యాయవాదులకు ఐదు సంవత్సరాలపాటు రాష్ట్ర ప్రభుత్వమే నెలవారీ స్టైఫండ్ చెల్లించాలని, 2019 తర్వాత నమోదు చేసుకున్న న్యాయవాదులందరికీ సంక్షేమ నిధిలో సభ్యత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని సూచించారు.తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు మందాడపు శ్రీనివాసరావు, వై. శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళా, దివ్యాంగ న్యాయవాదులకు కోర్టుల్లో ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి వెంకట్రెడ్డి మాట్లాడుతూ న్యాయవాదుల హక్కుల పరిరక్షణతోపాటు ప్రజాస్వామ్య, లౌకిక విలువల రక్షణ కోసం ఐలు నిరంతరం పోరాడుతుందని అన్నారు. మహాసభలకు జిల్లా అధ్యక్షులు బొల్లెపల్లి కుమార్ అధ్యక్షత వహించగా డి.ఎల్.ఎస్.ఏ కార్యదర్శి మాధవిలత, నిస్సంగి విద్యాసాగర్, ఐలు జిల్లా గౌరవ అధ్యక్షులు కుక్కదువ్వు సోమయ్య , సీనియర్ న్యాయవాదులు రవీందర్ రెడ్డి, హనుమంతు, కేమా రమదాన్, ఐలు జిల్లా నాయకులు మోహన్, ఎండి. నేహాల్, కిషన్, ఐలయ్య, జిట్టా భాస్కర్ రెడ్డి, యాదయ్య, ఖయ్యూం, రమేష్, శ్రీనివాస్, నరసింహ, రవి, గిరి, జయ, వెన్నెల, నాగమణి, సంతోష, ఐలు నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

భోజనానికి ప్రత్యేక సమయం కేటాయించండి!

ఉదయం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలకు ప్రత్యేక సమయం కేటాయించండి. ఆ సమయంలో ఫోన్ నోటిఫికేషన్లు, సోషల్ మీడియా, వీడియోలకు దూరంగా ఉండండి. ఈ అలవాటు ఆరోగ్యకరమైన జీవనశైలికి తోడ్పడుతుంది.

ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయం

ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ముద్ర, హైదరాబాద్, : భారతరత్న, ఉక్కు మహిళ, దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా శనివారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని ఆమె విగ్రహం వద్ద రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఇందిరాగాంధీ సామాజిక విప్లవంతో పాటు ఆర్థిక విప్లవానికి కూడా శ్రీకారం చుట్టారని కొనియాడారు. బ్యాంకుల జాతీయకరణ వంటి చారిత్రాత్మక నిర్ణయాల ద్వారా పేదలు, బడుగు బలహీన వర్గాలకు ఆర్థిక భరోసా కల్పించారని పేర్కొన్నారు. ఆమె తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు దేశంలో హరిత విప్లవానికి, వ్యవసాయ రంగ అభివృద్ధికి మార్గం సుగమం చేశాయని తెలిపారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో అట్టడుగు వర్గాల ప్రజలకు ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యం కల్పించడంలో ఇందిరాగాంధీ కీలక పాత్ర పోషించారని భట్టి విక్రమార్క అన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు, ఆర్థిక సాధికారత కల్పించాలన్న ఆమె ఆశయాలు నేటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

పోలీస్ అమరవీరులకు నివాళి.. కొవ్వొత్తుల ర్యాలీ

ముద్ర, కరీంనగర్ : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా కరీంనగర్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ ఘనంగా జరిగింది. తెలంగాణ చౌక్ నుంచి పోలీస్ కమిషనరేట్‌లోని అమరవీరుల స్తూపం వరకు ఈ ర్యాలీ సాగింది. ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అమర జవాన్ల త్యాగాలను స్మరిస్తూ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అన్యాయం నిరాహార దీక్ష

ముద్ర, కరీంనగర్ : సైదాపూర్ మండలంలోని బొమ్మకల్ గ్రామంలో రెండో విడత ఇందిరమ్మ ఎంపికలో అర్హులైన తమకు అన్యాయం జరిగిందని గ్రామస్తులు శనివారం రిలే నిరాహారదీక్ష చేపట్టారు. గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. కాగా రిలేనిరాహార దీక్ష శిబిరాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చెలిమెల రాజేశ్వర్ రెడ్డి, పైడిపల్లి రవీందర్, మాజీ సర్పంచులు చిట్టి ప్రకాష్ రెడ్డి, ఏరుకొండ ఇందిరాసుధీర్, నాయకులు శ్రావణ్, రాకేష్, అంజి, రంజిత్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎలాంటి వివక్ష లేకుండా పారదర్శంగా ఇండ్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరుగకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

వేములవాడలో దొంగల హల్ చల్..!..

నిర్మాణంలో ఉన్న భవనాల్లో విలువైన విద్యుత్ వైర్లు చోరీ
ఇప్పటికే రూ.10 లక్షల విలువైన విద్యుత్ వైర్ల చోరీ
ఆందోళనతో పోలీసులను ఆశ్రయించిన బాధితుడు



ముద్ర, వేములవాడ : వేములవాడ పట్టణంలో దొంగలు హల్ చల్ సృష్టిస్తున్నారు. నిర్మాణంలో ఉన్న ఇంటిని లక్ష్యంగా చేసుకొని విలువైన వస్తువులను చోరీ చేస్తుండగా యజమానులు ఆందోళన గురవుతున్నారు. వేములవాడ పట్టణంలోని రాజీవ్ నగర్ లో మల్లేశం అనే యజమాని నూతనంగా ఇంటి నిర్మాణాన్ని చేపట్టాడు. నిర్మాణ పనులు కూడా చివరి దశకు చేరాయి. ఇంకో వారం రోజుల్లో పనులు పూర్తవుతాయనిగా శనివారం ఇంట్లోని విలువైన విద్యుత్తు వైరును దొంగలించినట్లుగా గుర్తించారు. మొదటి అంతస్తుతోపాటు రెండో అంతస్తులో అమర్చిన విద్యుత్తు వైర్లను పూర్తిగా దొంగతనానికి పాల్పడినట్లు బాధితుడు తెలిపారు. సుమారు రూ.2.5ఏ లక్షల విలువైన విద్యుత్ వైర్ చోరీకి పాల్పడ్డగా బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఇక ఇది ఇలా ఉండగా 15 రోజుల క్రితం మార్కండేయ నగర్ లో మహేష్ అనే యజమాని ఇంట్లోనూ ఇదే తరహాలో విద్యుత్ వైర్ దొంగతనానికి పాల్పడినట్లు తెలిసింది. ఇతర రాష్ట్రాలకు చెందిన ముఠా ఇలా పట్టణంలో నిర్మాణంలో ఉన్న దాదాపు 10 ఇండ్లలో విద్యుత్ వైర్లు దొంగతనాన్ని పాల్పడగా పోలీసులు విచారణ చేపడుతున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల మెరుపు దాడి

ముద్ర, హైదరాబాద్ : పేకాట క్లబ్బులను ప్రభుత్వం మూసివేయడంతో ఇప్పుడు ఫామ్ హౌస్ లు అడ్డాగా పేకాట నడుస్తుంది ..ఎక్కడెక్కడ రీస్టార్ట్ లతోపాటు ఫామ్ హౌస్లలో పేకాట పెద్ద ఎత్తున నడుస్తున్నట్లు అధికారులకు సమాచారం వస్తుంది. ఏకంగా హైదరాబాద్ నగరంలోని వ్యాపారవేత్తలు అందరూ కలిసి ఇక్కడ లక్షల రూపాయలు పెట్టి పేకాట ఆడుతున్నట్లు అధికారుల విషయంలో బయటపడింది .దీంతో ప్రముఖ వ్యాపారవేత్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని వట్టినాగులపల్లిలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో జూదమాడుతున్న 27 మందిని అదుపులోకి తీసుకోగా, వారి వద్ద నుంచి సుమారు రూ.10 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. వట్టినాగులపల్లిలోని 'ది స్కై బై విహారా' ఫామ్‌హౌస్‌లో కొందరు వ్యక్తులు రహస్యంగా 'అందర్-బహార్' పేకాట ఆడుతున్నట్లు గచ్చిబౌలి పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ప్రత్యేక బృందంతో ఫామ్‌హౌస్‌పై మెరుపు దాడి నిర్వహించారు. అక్కడ పేకాట ఆడుతూ పట్టుబడిన 27 మందిని అదుపులోకి తీసుకుని, పందెం కాస్తున్న రూ.10 లక్షల నగదును సీజ్ చేశారు. బీఎన్ రెడ్డి నగర్‌కు చెందిన చిన్న యాదవ్, సన్‌సిటీకి చెందిన సోను, అలాగే నవీన్ అనే ముగ్గురు వ్యక్తులు కలిసి గత నాలుగు నెలలుగా ఈ ఫామ్‌హౌస్‌లో పేకాట క్లబ్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

ఇందిరమ్మ టవర్స్ ఇళ్ల కేటాయింపునకు 3, 4 తేదీల్లో ఈ-లాటరీ

నవంబర్ 3న నాలుగు నియోజకవర్గాలకు లబ్ధిదారుల ఎంపిక.. 4న మాప్‌అప్ లాటరీ
యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం.. పూర్తి పారదర్శకంగా కేటాయింపులు

ముద్ర, హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ ఇళ్ల కేటాయింపు ప్రక్రియకు తేదీలు ఖరారయ్యాయి. నవంబర్ 3, 4 తేదీల్లో ఆన్‌లైన్ ఈ-లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి. గౌతం వెల్లడించారు. ఈ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించడంతో పాటు ప్రజలందరూ వీక్షించేలా హౌసింగ్ డిపార్ట్‌మెంట్ యూట్యూబ్ ఛానెల్, ఇతర సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు తెలిపారు.ముషీరాబాద్, ఎల్.బి.నగర్, చాంద్రాయణగుట్ట, గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతిపాదించిన ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్లాట్ల కేటాయింపునకు సంబంధించి ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ, ప్రాథమిక పరిశీలన పూర్తయింది. అర్హులైన దరఖాస్తుదారులను ఎంపిక చేసేందుకు నవంబర్ 3న ఈ-లాటరీ నిర్వహించనున్నట్లు గౌతం వివరించారు.

నవంబర్ 4న మాప్‌అప్ లాటరీ

ఇందిరమ్మ ఇళ్ల పథకం పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో (కంటోన్మెంట్ మినహా) 480 ఇళ్ల చొప్పున నిర్మాణాలు చేపట్టారు. తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో అర్హులైన లబ్ధిదారులను లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ఆయా ప్రాంతాల్లో టవర్స్ నిర్మాణ పనులు కూడా కొనసాగుతున్నాయి. అయితే క్షేత్రస్థాయి పరిశీలనలో లాటరీ ద్వారా ఎంపికైన కొందరు లబ్ధిదారులు ప్రస్తుతం ఆయా నియోజకవర్గాల్లో నివాసం ఉండకపోవడం, ఆర్థిక కారణాలతో డబ్బులు చెల్లించలేమని చెప్పడం, ఇప్పటికే సొంత ఇళ్లు ఉండటం వంటి కారణాలతో వారి కేటాయింపులు రద్దయ్యాయి. దీంతో ఖాళీగా అందుబాటులోకి వచ్చిన ఇళ్లను ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన ఇతరులకు కేటాయించేందుకు నవంబర్ 4న మాప్‌అప్ ఈ-లాటరీ నిర్వహించనున్నారు.

చిరునామాల ఆధారంగా నియోజకవర్గాల మార్పు

గతంలో 16 నియోజకవర్గాల్లో కొందరు దరఖాస్తుదారులు తాము నివసిస్తున్న నియోజకవర్గానికి బదులుగా ఇతర నియోజకవర్గాల్లో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ కారణంగా గతంలో నిర్వహించిన లాటరీలో వారి పేర్లను చేర్చలేదు. అయితే దరఖాస్తుదారులు సమర్పించిన చిరునామాలను పరిశీలించి, జియోకోడ్స్ సేకరించి గూగుల్ మ్యాప్స్ సహాయంతో వారు ఏ నియోజకవర్గ పరిధిలోకి వస్తారో గుర్తించినట్లు వి.పి. గౌతం తెలిపారు. ఈ వివరాల ఆధారంగా అర్హులైన దరఖాస్తుదారుల పేర్లను ఖాళీగా ఉన్న ఇళ్ల భర్తీ కోసం నిర్వహించే మాప్‌అప్ లాటరీలో సుమోటోగా చేర్చనున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గాల మార్పు కోసం దరఖాస్తుదారులు చేసుకున్న విజ్ఞప్తులను కూడా పరిష్కరించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఉద్దేశం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల కేటాయింపులో అవకాశం కల్పించడమేనని, ఏ నియోజకవర్గంలో నివసించే వారికి అదే నియోజకవర్గంలో సొంత ఇంటి వసతి కల్పించాలన్న లక్ష్యంతో ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి. గౌతం స్పష్టం చేశారు.

బాత్రూమ్‌లో పడి బాలీవుడ్ దర్శకుడి మృతి

ముద్ర, ముంబయి: బాలీవుడ్‌లో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ దర్శకుడు, నిర్మాత సంజయ్ గుప్తా (57) కన్నుమూశారు. శుక్రవారం రాత్రి తన ఇంటి బాత్రూమ్‌లో ప్రమాదవశాత్తు జారిపడటంతో ఆయన తలకు తీవ్ర గాయమైనట్లు సమాచారం. ఈ గాయం కారణంగానే సంజయ్ మరణించినట్లు తెలుస్తోంది. ఆయన మరణ వార్తను దర్శకుడు అశోక్ పండిట్ ధ్రువీకరించారు. సంజయ్ గుప్తా మృతితో బాలీవుడ్ చిత్ర పరిశ్రమలో విషాదం నెలకొంది. పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 1994లో వచ్చిన 'ఆతిష్' సినిమాతో సంజయ్ గుప్తా దర్శకుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభించారు. దర్శకుడిగానే కాకుండా నిర్మాత, రచయితగానూ సంజయ్ గుప్తా తన ప్రతిభను చాటుకున్నారు.

కమీషన్లపై ఉన్న సోయి కరువుపై లేదు..

ముద్ర, తిమ్మాపూర్ : రాష్ట్రమంతా కరువు కాటకాలతో అల్లాడుతుంటే ప్రభుత్వం పంటలు వేయొద్దని డిక్లరేషన్లు కోరుతూ కరువు జాబితాలో కొన్ని మండలాలనే చేర్చడం ఏంటని, పాలకులకు కమీషన్లపై ఉన్న సోయి కరువుపై లేదని మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. కరువుతో పంటలు వేయద్దు అన్నప్పుడు అన్ని మండలాలు కరువు జాబితాలో చేర్చాలి అని డిమాండ్ చేశారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలో ఆయన శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం ఉంటుందని తెలిసి కూడా పైనుండి వస్తున్న నీళ్లను ఎత్తిపోయకుండా జాప్యం చేసి ఇప్పుడు పంటలు వేయద్దని కోరుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.గత 10 ఏళ్ల కాలంలో కాలమైనా కాకపోయినా ఎండల్లో సైతం కాలువల్లో నీళ్లు పరుగులు పెట్టాయని గుర్తు చేశారు. ఎలాంటి ముందస్తు ఆలోచన లేని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కనీసం నియోజకవర్గంలోని మండలాలను కరువు జాబితాలో చేర్చుకోలేని దుర్భరమైన పరిస్థితుల్లో ఉన్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలో రాష్ట్రానికి నీళ్లు అందించే ప్రముఖ ప్రాజెక్టులు ఉన్నా కూడా కరువు లేకుండా చేయలేకపోతున్నారని ధ్వజమెత్తారు. నియోజకవర్గంలోని కరువును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లలేని దౌర్భాగ్యంలో ఆయన ఉన్నారని ఎద్దేవా చేశారు. నియోజకవర్గాన్ని గాలికి వదిలేసి కమీషన్ల కక్కుర్తిలో గాలికి వదిలేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరువు మండలాల్లో చేర్చకపోతే ఎమ్మెల్యేని బాధ్యత వహించాలని, వారం రోజుల్లో జాబితాలో చేర్చకపోతే ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

తుమ్మిడిహట్టిపై మహారాష్ట్ర అభ్యంతరాలకు పరిష్కారం చూపండి

సాగునీటి లక్ష్యాలకు భంగం కలగకుండా పర్యావరణ ప్రభావాన్ని తగ్గించాలి
వివిధ నీటిమట్టాల్లో ముంపు వివరాలతో సమగ్ర పటాలు సిద్ధం చేయాలి
అధికారులకు ఆచరణాత్మక పరిష్కారాల రూపకల్పనపై దిశానిర్దేశం
బ్యారేజీ అలైన్‌మెంట్లు, సాంకేతిక అంశాలపై మంత్రి ఉత్తమ్ సమీక్ష

ముద్ర, హైదరాబాద్ : ప్రతిపాదిత తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర వ్యక్తం చేస్తున్న ముంపు, పర్యావరణ సంబంధిత ఆందోళనలకు సాంకేతికంగా సమర్థమైన, ఆచరణసాధ్యమైన పరిష్కారాలు రూపొందించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు సాగునీటి లక్ష్యాలకు భంగం కలగకుండా పర్యావరణ ప్రభావాన్ని తగ్గించే ఇంజినీరింగ్ మార్పులను పరిశీలించాలని సూచించారు.

మహారాష్ట్ర ప్రభుత్వంతో ఇటీవల జరిగిన చర్చలకు కొనసాగింపుగా శనివారం తుమ్మిడిహట్టి బ్యారేజీ సాంకేతిక అంశాలు, ప్రతిపాదిత అలైన్‌మెంట్లపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తన క్యాంప్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. వివిధ జలాశయ నీటిమట్టాల వద్ద ప్రభావితమయ్యే భూముల విస్తీర్ణాన్ని సమగ్రంగా అంచనా వేయాలని స్పష్టం చేశారు. వాస్తవంగా ఎంత మేర ముంపు ఏర్పడుతుందో నిర్ధారించేందుకు వివరమైన పటాలు సిద్ధం చేయాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. నదీగర్భ ప్రాంతాలు, అటవీ భూములు, పర్యావరణ సున్నిత మండలాలు, సంరక్షిత కోర్ ప్రాంతాలు, రెవెన్యూ భూములు, జనావాసాలను పటాల్లో స్పష్టంగా గుర్తించాలని సూచించారు. ఈ వివరాల ఆధారంగా మహారాష్ట్ర ఆందోళనలను పరిష్కరించే మార్గాలను పరిశీలించాలని పేర్కొన్నారు.

నీటి నిల్వను, వినియోగాన్ని మెరుగుపరిచేందుకు తుమ్మిడిహట్టి బ్యారేజీ పూర్తిస్థాయి జలాశయ నీటిమట్టాన్ని (ఎఫ్ఆర్ఎల్) 148 మీటర్ల నుంచి 152 మీటర్లకు పెంచాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. అక్టోబర్ 26న ముంబయిలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో జరిపిన సమావేశంలో ఈ ప్రతిపాదనపై చర్చించిన విషయం విదితమే.

సుందిళ్ల బ్యారేజీ, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుతో కూడిన సమగ్ర వ్యవస్థ ద్వారా 77 టీఎంసీల నీటిని మళ్లించి, ఏడు జిల్లాల పరిధిలోని 5.85 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. ప్రస్తుతం ప్రతిపాదిత 148 మీటర్ల నీటిమట్టం వద్ద నిల్వ సామర్థ్యం 2.182 టీఎంసీలు కాగా, 152 మీటర్లకు పెంచితే అది 5.697 టీఎంసీలకు చేరుతుంది.

తద్వారా నీటి నిల్వ సామర్థ్యం రెట్టింపునకు మించి పెరుగుతుంది. ప్రతిపాదిత 152 మీటర్ల నీటిమట్టం వద్ద కూడా ముంపు పరిమితంగానే ఉంటుందని ప్రాజెక్టు అంచనాలు సూచిస్తున్నాయి. తెలంగాణ, మహారాష్ట్రల్లో పునరావాసం, పునఃస్థాపనకు సంబంధించిన అవసరాలను పరిష్కరించవచ్చని ఈ అంచనాలు పేర్కొంటున్నాయి. సమీక్షలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ. శ్రీధర్, ఇంజినీర్ ఇన్ చీఫ్ (జనరల్) ఓ.వి. రమేష్‌బాబు పాల్గొన్నారు.

డ్రోన్, యాంటీ డ్రోన్ టెక్నాలజీపై సీఐఎస్ఎఫ్ - ఐఐటీ హైదరాబాద్ మధ్య కీలక ఒప్పందం

వైమానిక భద్రతను మరింత బలోపేతం చేయడమే లక్ష్యం..
శిక్షణ, పరిశోధనలో పరస్పర సహకారం

ముద్ర, హైదరాబాద్ : ముద్ర, హైదరాబాద్: దేశంలోని కీలక పారిశ్రామిక సంస్థలు, మౌలిక సదుపాయాల భద్రతను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) ఐఐటీ హైదరాబాద్‌లోని టిహాన్ సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. డ్రోన్, యాంటీ డ్రోన్ టెక్నాలజీలో శిక్షణ, పరిశోధన కోసం శుక్రవారం ఐఐటీ హైదరాబాద్‌లో ఈ ఒప్పందంపై అధికారులు సంతకాలు చేశారు.ఈ ఒప్పందంలో భాగంగా సీఐఎస్ఎఫ్ సిబ్బందికి డ్రోన్ల తయారీ, అసెంబ్లింగ్, నిర్వహణ, విమాన కార్యకలాపాలు, అధునాతన ఆటానమస్ సిస్టమ్స్‌పై ప్రత్యేక శిక్షణ అందించనున్నారు. అలాగే రాజస్థాన్‌లోని బెహ్రోర్‌లో ఏర్పాటు చేయనున్న డ్రోన్, యాంటీ డ్రోన్ టెక్నాలజీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు టిహాన్ సాంకేతిక సహకారం అందించనుంది.విద్యుత్, పెట్రోలియం, బొగ్గు, ఓడరేవులు వంటి కీలక రంగాలపై డ్రోన్ల ద్వారా ఎదురయ్యే ముప్పులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ హర్‌ప్రీత్ కౌర్ సోహి తెలిపారు. ఆధునిక పరిశోధనలను భద్రతా విధానాలకు అనుసంధానించడం ద్వారా సిబ్బంది సాంకేతిక సామర్థ్యం పెరుగుతుందని టిహాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజలక్ష్మి పేర్కొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 01.11.2026
www.mudranews.in | @mudranews

ఆకలిని గుర్తించి ఆహారం తీసుకోండి

ఫోన్ చూస్తూ తినడం వల్ల ఎంత తింటున్నామో తెలియకపోవచ్చు. దీనివల్ల అవసరానికి మించి ఆహారం తీసుకునే అవకాశం ఉంటుంది. కాబట్టి ఆకలి, కడుపు నిండిన భావనను గుర్తిస్తూ తినండి.

వేదాలు భారతీయ సంస్కృతికి ప్రాణం

గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా
యాదగిరిగుట్టలో 26వ తెలంగాణ వేద విద్వాన్ మహాసభలో గవర్నర్ సందేశం
వేద పరిరక్షణలో గురు-శిష్య పరంపర సేవలు అమూల్యం
వేద విద్యార్థులు, పండితులకు తగవర్నర్ అభినందనలు

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : వేద జ్ఞానమే భారతీయ నాగరికత, సంస్కృతులకు మూలాధారమని, వేదాలు కేవలం ఆధ్యాత్మిక చింతనకే పరిమితం కాకుండా ప్రకృతి పరిరక్షణ, మానవ జీవనం, నైతిక విలువలు, సామాజిక సామరస్యానికి మార్గదర్శకాలని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం, తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో నిర్వహించిన 26వ తెలంగాణ వేద విద్వన్మహా సభల్లో శనివారం గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు.ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, తరతరాలుగా వేదాలను పరిరక్షిస్తూ వస్తున్న గురు–శిష్య పరంపర భారతీయ సంస్కృతిలో అత్యంత విశిష్టమైనదని కొనియాడారు. ఆచార్యులు తమ నిరంతర సాధన, అంకితభావంతో వేదాల శుద్ధ ఉచ్చారణ, స్వర, పాఠ సంప్రదాయాలను పరిరక్షిస్తూ వస్తున్నారని పేర్కొన్నారు.ఈ మహాసభల్లో భాగంగా నిర్వహిస్తున్న వేద పరీక్షల్లో పాల్గొంటున్న 500 మందికి పైగా విద్యార్థులకు గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. వారి కృషి, క్రమశిక్షణ భారతీయ సాంస్కృతిక వారసత్వం ఉజ్వల భవిష్యత్తుకు నిదర్శనమని అన్నారు. జయపత్రాలు అందుకున్న 10 మంది వేద విద్యాంసులను ప్రత్యేకంగా అభినందించారు.యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రం వేద అధ్యయనం, ఆధ్యాత్మిక సాధన, సాంస్కృతిక చైతన్యానికి ప్రముఖ కేంద్రంగా ఎదిగేందుకు అపార అవకాశాలు ఉన్నాయని గవర్నర్ పేర్కొన్నారు. ప్రాచీన భారతీయ జ్ఞాన సంపదకు, ఆధునిక విజ్ఞానానికి మధ్య సార్థకమైన అనుసంధానం అవసరమని అన్నారు. వేద విద్యా సంస్థలు, విద్వత్ సభలు, గురుకులాలకు మరింత ప్రోత్సాహం అందించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ...గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఈ వేద పాఠశాలకు రావడం వేద విద్యార్థులకు ఒక నిదర్శనం అని

విద్యార్థులందరూ గవర్నర్ ను నిదర్శనంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. సుదీర్ఘంగా చాలా సంవత్సరాలు మన వేద సంస్కృతిని అహర్నిశలు ప్రతి సందర్భం, ప్రతి సమయంలోముందుకు తీసుకెళ్తూ.. గత 20 సంవత్సరాల నుంచి వేదాన్ని గురించి, వేదానికి ఉన్న మహానత్యం గురించి, వేదం చదువుకోవాలనే ఒక పెద్ద సంకల్పంతో ముందుకు నడిపిస్తున్న ప్రముఖులు శ్రీ సాయినాథ్ శర్మ ఆశీస్సులు అందరికీ ఉండాలన్నారు. వేద విద్వన్మహా సభలు నిర్వహిస్తున్న తరుణంలో వేద సభలకు సంబంధించిన పరీక్షలు వ్రాస్తున విద్యార్థుల సంఖ్య మెరుగు పర్చాలన్నారు.ఈ వేద విద్యను పెంపొందించడానికి మన పిల్లల్లో ఒకళ్ళని వేద విద్యను నేర్చుకోవాలని వారిని ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు కూడా హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. చాలామంది వేద విద్యకు సంబంధించిన విద్యార్థులతో పెద్ద ఎత్తున ముందుకు తీసుకెళ్లాలని, ఈ ప్రాంగణంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడానికి తాను ప్రోత్సహం చేస్తానని తెలిపారు.ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ...వేదాన్ని పఠిస్తూ తెలంగాణ సాంప్రదాయంతో భారతదేశ సంస్కృతికి మూలం వేద విద్య అని అన్నారు.వేద విద్య జ్ఞానాన్ని పెంపొందిస్తూ శక్తి ఏకాగ్రత పెంపొందిస్తుందన్నారు.ఋగ్వేదం, సామవేదం,వివిధ వేదాలలో పరీక్షలో ప్రతిభ కనబరచిన వేద విద్యార్థులకు

గవర్నర్ శాలువ, మెమెంటో లతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జనార్దనా సరస్వతి స్వామి సంస్కృతి ట్రస్ట్ చైర్మన్ సాయినాథ్ శర్మ, గవర్నర్ స్పెషల్ సిఎస్ దాన కిషోర్, ధార్మిక సలహాదారు ఆర్. గోవింద్ హరి, దేవాదాయ శాఖ కమిషనర్ ఎం. హనుమంతరావు, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అక్షాంష్ యాదవ్,దేవస్థానం కార్యనిర్వహణాధికారి ,జె. భవానీ శంకర్, పూజ్య ఆచార్యులు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

తైక్వాండోలో గుర్రం కృష్ణకు గిన్నిస్ వరల్డ్ రికార్డు

తెలుగు విశ్వవిద్యాలయంలో ప్రశంసాపత్రం, మెడల్ అందజేత

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : తైక్వాండో క్రీడలో విశేష ప్రతిభ కనబరిచి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన గ్రాండ్ మాస్టర్ గుర్రం కృష్ణకు అరుదైన గౌరవం దక్కింది. శనివారం హైదరాబాద్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు.గత ఆగస్టు 9, 2026న హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన లార్జెస్ట్ తైక్వాండో లేసన్ – అధికారిక గిన్నిస్ వరల్డ్ రికార్డు కార్యక్రమంలో మొత్తం 533 మంది తైక్వాండో క్రీడాకారులు పాల్గొన్నారు. పూమ్సే, క్యూరీగి, పంచెస్, బ్లాక్స్, కిక్స్, సెల్ఫ్ డిఫెన్స్ వంటి విభాగాల్లో ఒకేసారి ప్రదర్శించిన అద్భుత విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో తమ ప్రతిభను చాటుకున్న గ్రాండ్ మాస్టర్ గుర్రం కృష్ణ గిన్నిస్ వరల్డ్ రికార్డును సాధించారు. ఆయనతోపాటు తూర్పునూరి మల్లేశం, గుర్రం ధనమ్మ కూడా ఈ రికార్డును కైవసం చేసుకున్నారు.ఈ సందర్భంగా గుర్రం కృష్ణతోపాటు రికార్డు సాధించిన క్రీడాకారులను జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి తైక్వాండో క్రీడాకారులు, రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు గ్రాండ్ మాస్టర్ ఎం. జయంత్ రెడ్డి, మహేశ్వర్, వహాజ్ అలీ ఖాన్, మారుతి, నరసింహ, హనుమంతు, శివప్రసాద్, భరత్ కుమార్ అభినందించారు. వారి విజయంపై క్రీడాభిమానులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. తైక్వాండో రంగంలో సాధించిన ఈ విజయం యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని పలువురు కొనియాడారు.

భూముల విక్రయం బినామీల కోసమే

ఎంపీ వద్దిరాజు

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 31 : రాష్ట్రంలో పాలనను పూర్తిగా గాలికొదిలేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా మంత్రులు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులంతా ఢిల్లీ పర్యటనలకే ప్రాధాన్యమిస్తున్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీలు తాతా మధుసూదన్, తక్కళ్లపల్లి రవీందర్ రావులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి తన 34 నెలల పాలనలో సాధించిందేమీ లేదని, ఢిల్లీ నుంచి నయా పైసా నిధులు కూడా తేలేక పోయారని ఎద్దేవా చేశారు. బూటకపు వాగ్దానాలు, అబద్ధాలు, ప్రతిపక్షాలపై తప్పుడు ప్రచారాలు, పోలీసులను, మీడియాను వాడుకుంటూ 'డైవర్షన్ పాలిటిక్స్' చేయడం తప్ప ప్రభుత్వానికి స్పష్టమైన నైతికత లేదని మండిపడ్డారు.గతంలో కేసీఆర్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో ప్రముఖ న్యాయవాదిని పెట్టి కాపాడిన మియాపూర్ లోని 550 ఎకరాల భూములను, తీర్పు రాగానే విక్రయానికి పెట్టి తన బినామీలకు కట్టబెట్టేందుకు ముఖ్యమంత్రి యత్నిస్తున్నారని విమర్శించారు. రాజధాని నగరం, దాని పరిసరాల్లో ఉన్న విలువైన భూములను భవిష్యత్ తరాల సామాజిక ప్రయోజనాలకు కాకుండా అమ్మకానికి పెట్టడం తీవ్ర అభ్యంతరకరమని, పాలకులు రియల్

ఎస్టేట్ వ్యాపారులుగా మారి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. కేసీఆర్ ఎంతో దూరదృష్టితో రూపొందించిన ఫార్మాసిటీని పక్కనపెట్టి ఫ్యూచర్ సిటీ పేరుతో రేవంత్ రెడ్డి ఆగమాగం చేస్తున్నారని ధ్వజమెత్తారు.కాళేశ్వరం ప్రాజెక్టులోని సమస్యలపై డ్యామ్ సేఫ్టీ అధికారుల సూచనలను పట్టించుకోకుండా, గోదావరి నీటిని కిందకు వదిలేయడం ద్వారా రేవంత్ రెడ్డి తన గురువు చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించుకున్నారని వ్యాఖ్యానించారు. ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ కక్షపూరితంగా 800 టీఎంసీల నీటిని సమర్థవంతంగా వాడుకోకుండా వృథా చేశారనీ ఆవేదన వ్యక్తం చేశారు. కరువు పరిస్థితులు నెలకొన్నా, సింగరేణి, విద్యుత్తు ఉత్పత్తి, రైతుల సంక్షేమంపై ప్రభుత్వానికి ధ్యాస లేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలకుల వైఖరిని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఘన విజయం సాధించి కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

అసలు హంతకులను అరెస్టు చేయాలి

అఖిలపక్ష సమావేశంలో సీపీఎం, ప్రతిపక్ష నేతల డిమాండ్

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 31 : సీపీఎం రాష్ట్ర సీనియర్ నాయకులు, పాతర్లపాడు గ్రామ మాజీ సర్పంచ్ సామినేని రామారావు హత్య కేసులో నిజమైన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, కేసు సమగ్ర విచారణ కోసం వెంటనే స్వతంత్ర సిట్ ఏర్పాటు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సుందరయ్య భవన్‌లో నున్నా నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన అఖిలపక్ష పార్టీల సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించారు.సరిగ్గా ఏడాది క్రితం 2025 అక్టోబర్ 31న ఉదయం తన నివాసం వద్ద పశువుల కొట్టంలో రామారావు హత్యకు గురయ్యారని గుర్తుచేసిన నాయకులు, నాటి నుంచి నేటి వరకు హంతకులను పట్టుకోవడంలో పోలీసులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల ఖమ్మం సీపీ నిర్వహించిన విలేకరుల సమావేశంలో అసలు దోషులను పక్కన పెట్టి, కేసుతో సంబంధం లేని నలుగురు వ్యక్తులపై కట్టుకథలు అల్లారని ఆరోపించారు. స్థానిక కాంగ్రెస్ నాయకుల రాజకీయ కక్షల వల్లే ఈ హత్య జరిగిందని,

దోషులను రక్షించేందుకు అధికార పార్టీ నాయకులు, పోలీసులు కుమ్మక్కయ్యారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిట్ ఏర్పాటుకు అంగీకరించినప్పటికీ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అడ్డుపడటం వల్లే అది కార్యరూపం దాల్చలేదని దుయ్యబట్టారు.ఈ సందర్భంగా రామారావు కుమారుడు సామినేని విజయ్ మాట్లాడుతూ పోలీసుల విచారణ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తండ్రి ఆస్తుల వివాదం పోలీసులు నిరూపించాలి.... తన తండ్రికి ఆర్థిక, రాజకీయ, రియల్ ఎస్టేట్ వివాదాలు ఉన్నాయంటూ సీపీ సునీల్ దత్, కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. తమ కుటుంబానికి ఎక్కడెక్కడ ఆస్తుల వివాదాలు ఉన్నాయో పోలీసులు నిరూపించాలని, వందల కోట్ల ఆస్తులు ఉన్నట్లు ఆధారాలు చూపిస్తే వాటిని ప్రభుత్వానికే రాసిస్తామని సవాల్ విసిరారు. లేని వివాదాలను సృష్టించి తమ కుటుంబానికి మానసిక క్షోభ కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసిన ఆయన, నిజమైన దోషులకు శిక్ష పడేవరకు న్యాయపోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.అఖిలపక్ష సమావేశంలో సీపీఐ జిల్లా నాయకులు శింగు నరసింహారావు, లక్ష్మీనారాయణ, సీపీఎం నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, బండి రమేష్, కళ్యాణ వెంకటేశ్వరరావు, వై. విక్రమ్, మాచర్ల భారతి, బొంతు రాంబాబు, మాదినేని రమేష్, ఎర్ర శ్రీనివాసరావు, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు బండారు ఐలయ్య, కందగట్ల సురేందర్, పీడీఎస్‌యూ, పీవైఎల్, సీఐటీయూ, అరుణోదయ, కేవీపీఎస్ తదితర ప్రజాసంఘాల ప్రతినిధులు, బాధితుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శోభాయమానంగా శ్రీవారి వసంతోత్సవం

సకల దోష నివారణార్థం శ్రీ సుదర్శన నారసింహ హవనం

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : స్వర్ణగిరి దివ్యక్షేత్రంలో శ్రీ అష్టలక్ష్మి మండపంలో శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పంచామృతములు, పసుపు, సుగంధ ద్రవ్యాలతో వేదమంత్రోచ్చారణలతో వసంతోత్సవ సేవను శోభాయ మానంగా నిర్వహించి అనంతరం అర్చక స్వాములు కర్పూర మంగళహారతులు సమర్పించారు. సకల దోష నివారణార్థం అమావాస్యని పురస్కరించుకొని స్వర్ణగిరి క్షేత్రంలో శ్రీ సుదర్శన నారసింహ హవనం, శనివారం సందర్భంగా జల నారాయణ స్వామి వారికి మంగళహారతులు సమర్పించారు.

నీటిని పొదుపుగా వినియోగించాలి

కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

ముద్ర ప్రతినిధి, ములుగు, అక్టోబర్ 31: ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో అందుబాటులో ఉన్న జలవనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ప్రజలకు సూచించారు. రానున్న వేసవి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి నీటి చుక్కను పొదుపు చేయాలని కోరారు.జిల్లాలో వానాకాలం పంటలకు రామప్ప సరస్సు ద్వారా 5,180 ఎకరాలు, లక్నవరం సరస్సు ద్వారా 4,500 ఎకరాలు, పాలెంవాగు ప్రాజెక్టు ద్వారా 7,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించినట్లు తెలిపారు.కన్నాయిగూడెం మండలం గంగారం గ్రామంలోని దేవాదుల పంపుహౌస్ ద్వారా జూలై 2026 నుంచి ఇప్పటివరకు సుమారు 16.50 టీఎంసీల నీటిని ఎత్తిపోసి, ఎత్తైన ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాలకు మళ్లించినట్లు పేర్కొన్నారు. ఇకపై నీటి ఎత్తిపోతలు గోదావరిలో నీటి లభ్యతపై ఆధారపడి ఉంటాయని వివరించారు.ప్రాజెక్టు కట్టల పటిష్టత, కాలువల నిర్వహణ, తూముల మరమ్మతులను నీటి పారుదల శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. సరఫరా చేస్తున్న నీరు ఆయకట్టు చివరి భూములకు చేరేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.యాసంగి సాగుపై రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున యాసంగి పంటలకు సాగునీరు విడుదల చేయడం కష్టతరంగా మారిందని కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని పేర్కొన్నారు. రైతులు ఈ పరిస్థితిని అర్థం చేసుకొని సహకరించాలని కోరారు.యాసంగి సాగుకు సన్నద్ధమయ్యే ముందు నీటిపారుదల శాఖ అధికారులను సంప్రదించి, నీటి లభ్యత, విడుదల వివరాలను తెలుసుకోవాలని సూచించారు. దేవాదుల పంపుహౌస్‌ల నిర్వహణను పర్యవేక్షిస్తూ, గోదావరిలో నీటి లభ్యతకు అనుగుణంగా జలాశయాలు, చెరువులను నింపేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రానున్న వేసవిలో ఎత్తైన ప్రాంతాల్లో నీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని కోరారు. పైపులైన్లలో లీకేజీలను గుర్తిస్తే సంబంధిత అధికారులకు తెలియజేయాలని, నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.సమాచారం కోసం సంప్రదించాల్సిన అధికారులు:యాసంగికి నీటి విడుదల మరియు ఆయకట్టుకు సరఫరా వివరాలు: సాగునీటికి సంబంధించిన సలహాల కోసం స్థానిక సహాయ ఇంజినీర్లు, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లను సంప్రదించాలని సూచించారు. జిల్లా స్థాయిలో కింది అధికారులను సంప్రదించవచ్చని తెలిపారు.బి. అప్పల నాయుడు, జిల్లా నీటిపారుదల అధికారి, ములుగు, ఫోన్: 9704678210సిహెచ్. శంకరయ్య,కార్యనిర్వాహక ఇంజినీర్, ఏటూరునాగారం, ఫోన్: 9441653031కె. నారాయణ, కార్యనిర్వాహక ఇంజినీర్, ములుగు, ఫోన్: 9492643623.

తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక మండల అధ్యక్షుడిగా అంతగిరి రాజు

ముద్ర ప్రతినిధి, ములుగు, అక్టోబర్ 31 : వెంకటాపురం మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామంలోని ఐఆర్ ఫంక్షన్ హాల్‌లో లక్ష్మీదేవిపేట మాజీ సర్పంచ్ గట్టు కుమార్ అధ్యక్షతన తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక మండల స్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ములుగు జిల్లా అధ్యక్షులు రేండ్ల సంతోష్ మాట్లాడుతూ, తెలంగాణ స్వరాష్ట్రం కోసం వెంకటాపురం మండలం నుంచి అనేక గ్రామాల ఉద్యమకారులు నిర్బంధాలను, కేసులను, లాఠీ దెబ్బలను లెక్కచేయకుండా అలుపెరుగని పోరాటం చేశారని గుర్తు చేశారు. ఉద్యమ సమయంలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించి తక్షణమే ప్రభుత్వం వారికి పింఛన్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, అమరులైన కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి ఇండ్లు కట్టించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.అనంతరం మండల కమిటీ అధ్యక్షునిగా అంతగిరి రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అంతగిరి రాజు మాట్లాడుతూ, తనపై నమ్మకంతో మండల అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ఉద్యమకారుల పూర్తి వివరాలను సేకరించి, వారికి న్యాయం జరిగేలా ఐక్యవేదికతో ముందుకు సాగుతానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సన్నగుండ్ల వెంకటేశ్వర్లు, సీనియర్ ఉద్యమకారులు గట్టు శీను, పెరుమాండ్ల పున్నం, గట్టు చిన్న రాజయ్య, ఎల్లిమిల్ల రఘు, జిల్లాల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ గెజిటెడ్ అవార్డు గ్రహీత బ్రహ్మచారికి వీడ్కోలు

ముద్ర, దేవరకొండ: 35 సంవత్సరాలుగా విద్యాబోధన రంగంలో వివిధ హోదాలో విశిష్ట సేవలు అందించి జిల్లా స్థాయి ఉత్తమ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయ అవార్డు ను అందుకున్న నేరేడుగొమ్ము మండల విద్యాధికారి తాటికొండ బ్రహ్మచారి కి ఘనంగా ఆత్మీయ వీడ్కోలు సన్మాన సభ ను గోన బోయినపల్లి లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ దంపతులను పూలమాలలతో, శాలువాలతో, సన్మానించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ తాటికొండ బ్రహ్మచారి 35 ఏళ్ల సుదీర్ఘ సర్వీసులో ఎంతో మంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీర్చిదిద్దారని, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా, మండల విద్యాధికారిగా తన బాధ్యతలను అత్యంత నిబద్ధతతో నిర్వహించారని కొనియాడారు. తన అంకితభావానికి గుర్తింపుగా ఉత్తమ గెజిటెడ్ అవార్డు రావడం మండలానికే గర్వకారణమని తెలిపారు. ఆయన సేవలు నేటి యువ ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంఆర్సీ స్టాఫ్, విద్యార్థులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భోజనం చేసేటప్పుడు ఫోన్ పక్కన పెట్టండి

ఆహారం తినే సమయంలో మొబైల్ చూడటం మానేయండి. ఫోన్‌పై కాకుండా ఆహారంపై దృష్టి పెట్టడం వల్ల తినే ప్రక్రియను ఆస్వాదించడంతో పాటు ఆరోగ్యకరమైన అలవాట్లు అలవడతాయి.

మెదక్‌ను కరువు జిల్లాగా ప్రకటించాల్సిందే!

రౌండ్ టేబుల్ సమావేశంలో డిమాండ్

ముద్ర ప్రతినిధి, మెదక్: మెదక్ జిల్లాలో నెలకొన్న వ్యవసాయ పరిస్థితులు, వర్షాభావం, పంటల నష్టాన్ని సమగ్రంగా పరిశీలించి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేసింది. మెదక్ జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులపై మెదక్ సిటిజన్స్ ఫోరం, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(ఐజేయూ), తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(హెచ్ 143), రైతు స్వరాజ్య వేదిక, మెదక్ స్టడీ సర్కిల్ ల సంయుక్తంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు మాట్లాడారు. సిటిజన్స్ ఫోరం అధ్యక్షులు కొండల్ రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జీ అజయ్, సిపిఎం నేత మల్లేశం, బిఆర్ఎస్ కన్వీనర్ మామిళ్ళ ఆంజనేయులు, మానవ హక్కుల వేదిక నేత హైమద్ లు మాట్లాడుతూ....కరువు పరిస్థితుల నిర్ధారణలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు తీవ్ర అసంతృప్తిగా ఉన్నాయన్నారు. క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోకుండా మండలాలను ప్రాతిపదికగా తీసుకొని కరువు పరిస్థితులను అంచనా వేయడం వల్ల వాస్తవ పంట నష్టం వెలుగులోకి రావడం లేదని వారు అభిప్రాయపడ్డారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని ప్రతి గ్రామంలో పంటల సాగు, వర్షపాతం, దిగుబడి, నష్టాలను శాస్త్రీయంగా అంచనా వేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతంగానికి సంబంధించిన 27 తీర్మానాలను రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సమావేశంలో నాయకులు మైసయ్య యాదవ్, పిడి ఆనందం, భాగయ్య, బాలరాజ్ గౌడ్, సురేందర్ రెడ్డి, మెంగర్తి సుధాకర్, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామారావు హత్య కేసులో నిజమైన నిందితులను అరెస్టు చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా డిమాండ్

దిష్టిబొమ్మ దగ్ధం

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 31 : సామినేని రామారావు హత్య కేసులో అసలైన నిందితులను కాపాడేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా పోలీస్ అధికారి సునీల్ దత్ ప్రయత్నిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తీవ్రంగా విమర్శించారు. ఇటువంటి ప్రయత్నాలను తక్షణమే ఆపి, కేసును నీరుగార్చకుండా నిష్పక్షపాతంగా దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. సీపీఎం ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని ఎన్ ఎస్ టి రోడ్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ సామినేని రామారావు హత్య అత్యంత దారుణమైన ఘటన అని పేర్కొన్నారు. ఈ దారుణం వెనుక ఉన్న అసలు కారణాలు, కుట్రదారులు, ప్రత్యక్షంగా పాల్గొన్న వ్యక్తులను సమగ్ర దర్యాప్తు ద్వారా వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. కేసు ప్రారంభం నుంచే రాజకీయ దురుద్దేశంతో కొందరిని తప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న జిల్లా పోలీస్ అధికారి మంత్రికి అనుకూలంగా వ్యవహరిస్తూ పోలీసు వ్యవస్థ ప్రతిష్ఠకు మచ్చ తెస్తున్నారని విమర్శించారు.రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి, హత్యకు పాల్పడిన వారితో పాటు కుట్ర పన్నిన అసలైన నిందితులను గుర్తించి తక్షణమే అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దర్యాప్తులో పారదర్శకత పాటించి ప్రజలకు వాస్తవాలను వెల్లడించాలని, నేరస్థులు ఎంతటి రాజకీయ పలుకుబడి కలిగిన వారైనా చట్టం ముందు నిలబెట్టాలని స్పష్టం చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్, నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, మాదినేని రమేష్, మడిపల్లి గోపాల్ రావు, ఎస్.కె. మీరా సాహెబ్, భుక్యా శ్రీనివాసరావు, ఎస్. నవీన్ రెడ్డి, పి. రమ్య, బండారు రమేష్, ఎస్.కె. నాగుల మీరా, బోడపట్ల సుదర్శన్, బత్తుల ఉపేంద్ర, కె. దేవేందర్, వజేనేపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

6 తర్వాత కూడా ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అవకాశం

: అదనపు సీఈఓ డాక్టర్ వాసం

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 31 : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై ఖమ్మం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర్ టి ఎస్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు సీఈఓ మాట్లాడుతూ, ఓటరు నమోదు గడువు నవంబర్ 6తో ముగిసిపోదని, ఆ తేదీ తర్వాత కూడా ముసాయిదా ప్రచురణ అనంతరం డిసెంబర్ 10 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల రూపంలో దరఖాస్తులు సమర్పించవచ్చని స్పష్టం చేశారు. చివరికి నామినేషన్ల దాఖలు గడువు వరకు కూడా ఫారం-18 ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేసేలా విస్తృత ప్రచారం కల్పించాలని, బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో నివాస స్థితిని, విద్యార్హతలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఒకే ఐడీ లేదా ప్రాంతం నుండి ఎక్కువ దరఖాస్తులు వస్తే ప్రత్యేక విచారణ జరపాలని, డబుల్ ఓటు నమోదు చట్టరీత్యా నేరమని హెచ్చరించారు.కలెక్టర్ దివాకర్ టి ఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఈసారి 1.5 లక్షలకు పైగా పట్టభద్రుల ఓటర్లను నమోదు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తయిన ప్రతి ఒక్కరూ కొత్తగా ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం 73,898 దరఖాస్తులు వచ్చాయని, నమోదుకు సంబంధించిన సందేహాల నివృత్తికి కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ అందిన దరఖాస్తుల విచారణ బాధ్యతలను రెవెన్యూ సిబ్బందికి అప్పగించామని, నవంబర్ 25న ముసాయిదా ఓటరు జాబితా, డిసెంబర్ 30న తుది జాబితా ప్రచురించనున్నట్లు వెల్లడించారు. ఈ సమీక్ష సమావేశంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు ఎన్నికల విభాగ అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకులో సహఉద్యోగినిపై కత్తితో దాడి

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 31 : వైరాలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు బ్రాహ్మణపల్లి శాఖలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అదే బ్యాంకులో ఫీల్డ్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న పిల్లి ప్రదీప్, తేజశ్రీల మధ్య జరిగిన ఊహించని పరిణామాలు కలకలం రేపాయి. విధుల్లో భాగంగా బ్యాంకులోనే ఉన్న తేజశ్రీపై పిల్లి ప్రదీప్ ఆకస్మికంగా కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఆమె గొంతుపై దాడి చేయడానికి ప్రదీప్ యత్నించగా, ఆమె అప్రమత్తమై చేయి అడ్డుపెట్టడంతో చేతి వేళ్లతో పాటు ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి.పట్టపగలు బ్యాంకు కార్యాలయంలోనే ఈ ఘటన జరగడంతో ఒక్కసారిగా భయాందోళన వాతావరణం నెలకొంది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది, స్థానికులు గాయపడిన తేజశ్రీని చికిత్స నిమిత్తం బ్యాంకు పక్కనే ఉన్న ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, దాడికి పాల్పడిన ప్రదీప్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సర్దార్ వల్లభాయ్ పటేల్, ఇందిరాగాంధీలకు నివాళి

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి: శ్రీ లక్ష్మీనరసింహస్వామి డిగ్రీ కళాశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, నాశముక్త్ భారత్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నాకోటి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి రమేష్, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ప్రోగ్రాం ఆఫీసర్స్ కనక బాలరాజు, టీ.రామకృష్ణ ఎండీ. అత్తరుసరిన్, డాక్టర్ ఎన్ సత్యనారాయణ, సిద్ధి రాములు, ఎన్.సుధా, బి పాండురంగం, కె.పవన్ పాల్గొన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో భారతీయ జనతా పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి కార్యక్రమాన్ని జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాయ దశరథ, జిల్లా ఉపాధ్యక్షులు జైనపల్లి శ్యామ్ సుందర్ రెడ్డి, మంగు నర్సింహా రావు, కౌన్సిలర్ బండారు స్వర్ణలత, పట్టణ ప్రధాన కార్యదర్శులు రాళ్లబండి కృష్ణచారి, ఉడుత భాస్కర్, నాయకులు సుధాకర్, కానుకుంట్ల రమేష్, పెంటబోయిన నాగరాజు, ఎంగి ప్రేమలత, సాయి ప్రసాద్, ఎదగాని సంతోష్ పాల్గొన్నారు.

ఖమ్మంలో..

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 31 : సంజీవరెడ్డి భవన్ లో భారతదేశ తొలి మహిళా ప్రధాని స్వర్గీయ శ్రీమతి ఇందిరాగాంధీ వర్ధంతి, తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, మాజీ శాసనసభ్యులు కొండబాల కోటేశ్వర రావులతో కలిసి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ దేశ సమగ్రత, ఆత్మగౌరవం కోసం ఇందిరాగాంధీ ప్రాణత్యాగం చేశారని, ఆమె ధైర్యం, పేదరిక నిర్మూలనకు తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు నేటికీ ఆదర్శనీయమని కొనియాడారు. ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. 560కి పైగా సంస్థానాలను భారత్ యూనియన్ లో విలీనం చేసిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు భానోత్ బాలాజీ నాయక్, ఆర్టీఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్ తో పాటు పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ములుగులో..

ముద్ర ప్రతినిధి ములుగు అక్టోబర్ 31: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా వెంకటాపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో మండల స్పెషల్ ఆఫీసర్ కొమురయ్య, తహసిల్దార్ గిరిబాబు, ఇంచార్జ్ ఎంపీడీవో షాజియా లతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం మండల అధికారులు, సర్పంచ్ లు, పంచాయతీ కార్యదర్శులతో సిబ్బందితో కలిసి జాతి ఐక్యత, రాష్ట్రీయ ఏక్తా దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా స్పెషల్ ఆఫీసర్ కొమురయ్య మాట్లాడుతూ దేశ ఐక్యత, సమగ్రత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి చరిత్రలో చిరస్మరణీయమన్నారు. స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని సంస్థానాలను విలీనం చేసి అఖండ భారత నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన ఆయన దూరదృష్టి, నాయకత్వ లక్షణాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమన్నారు.పటేల్ ఆలోచనలు, ఆశయాలు, స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తాయని, ముఖ్యంగా యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని దేశ ఐక్యత, సమగ్రత పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు.ప్రతి ఒక్కరూ భారతీయులమనే భావనతో ఐకమత్యంగా ఉండాలని, జాతీయ ఐక్యతను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయడమే సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు అర్పించే నిజమైన నివాళి అన్నారు.ఈకార్యక్రమంలో తహసిల్దార్ గిరిబాబు, ఇన్చార్జ్ ఎంపీడీవో షాజియా, సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ఫోటో రైటప్: చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న స్పెషల్ ఆఫీసర్ కొమురయ్య, తహసిల్దార్ గిరిబాబు

షీ టీమ్స్ నిఘా.. 75 మందికి కౌన్సెలింగ్

వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు

ముద్ర ప్రతినిధి, మెదక్: అక్టోబర్ నెలలో జిల్లావ్యాప్తంగా షీ టీమ్స్ ఆధ్వర్యంలో మహిళలు, బాలికల భద్రత, వేధింపుల నివారణ, సైబర్ నేరాలపై 54 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు వెల్లడించారు. మహిళలను వేధిస్తున్న 75 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు, 2 ఈ-పెట్టి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.మహిళలను వేధించడం, అసభ్యకరంగా ప్రవర్తించడం, సోషల్ మీడియా ద్వారా ఇబ్బందులకు గురిచేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. మహిళలు, బాలికలు ఎలాంటి భయం లేకుండా తమకు ఎదురయ్యే వేధింపులపై షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళల భద్రతకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

మాదకద్రవ్యాలు నిర్మూలించాలి

అదనపు కలెక్టర్ నగేష్

ముద్ర ప్రతినిధి, మెదక్: మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. మెదక్ కలెక్టరేట్ లో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు, విద్యార్థుల విద్యాభ్యాసం, కుటుంబ వ్యవస్థ, సమాజంపై తీవ్ర దుష్ప్రభావాలు కలుగుతున్నాయని తెలిపారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై కఠిన నిఘా ఏర్పాటు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, మాదకద్రవ్యాల వ్యసనానికి గురైన వారికి అవసరమైన వైద్య సేవలు, కౌన్సెలింగ్, పునరావాస సహాయం అందించాలన్నారు.పిల్లలు, కౌమారదశ యువతలో మాదకద్రవ్యాల వినియోగం పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ అహ్మద్ , మున్సిపల్ కమీషనర్ నవీన్, డిఎస్పీ వెంకటేశ్వర రావు, డీఎంహెచ్ఓ డాక్టర్ గణేశ్వర్, డీఐఈఓ మాధవి, హుస్సేన్, శ్రీనివాస్ రావు, సునీత రాకేష్, ఆభరణ తదితరులు పాల్గొన్నారు.

50 మండళ్లచే భజన కార్యక్రమం

ముద్ర ప్రతినిధి, మెదక్: .అశోక్ సింగాల్ శతజయంతి ఉత్సవాలలో భాగంగా మెదక్ మాయ గార్డెన్ లో ఆయా గ్రామాల వారిచే శనివారం భజనల కార్యక్రమం నిర్వహించారు. 50 భజన మండళ్లు పాల్గొన్నాయి. ఇలాంటి కార్యకమాలు సంఘటితం చేస్తాయని సామాజిక సమరసత రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గానందపురి స్వామీజీ, విశ్వహిందూ పరిషత్ మెదక్ జిల్లా సేవ ప్రముఖ్ పిప్పిరి రవీందర్, విభాగ్ కార్యదర్శి పుట్టి మల్లేశం, పండరినాథ్, వాసు, ఓంకార్, మల్కాజి సత్యనారాయణ, సిర్న శారద తదితరులు పాల్గొన్నారు. శ్రీరామ నామం మారుమ్రోగింది.

పసి బాబును వదిలేశారు..!

ముద్ర ప్రతినిధి, మెదక్: మెదక్ పాపన్నపేట మండలం పొడిచన్ పల్లి తండా సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు పసి బాబును వదిలేశారు. జిల్లా బాలల సంరక్షణ విభాగానికి సమాచారం రావడంతో శిశు, సంక్షేమ శాఖ అధికారులు వెంటనే స్పందించి పసి బాబును రెస్క్యూ చేసి చికిత్స కోసం మెదక్ లోని మాత, శిశు సంరక్షణ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం డాక్టర్ల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం బాబును హైదరాబాదులోని నీలోఫర్ హాస్పిటల్ కు తరలించారు. ఈ విషయంపై అధికారులు కేసు నమోదు చేశారు.

ఘనంగా ఏఐటియుసి ఆవిర్భావ దినోత్సవం

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 31 : ఏఐటియుసి 107వ ఆవిర్భావ దినోత్సవాన్ని నగరంలో ఘనంగా నిర్వహించారు. నూరేళ్ల పైలాన్ వద్ద శింగు నర్సింహారావు జెండాను ఆవిష్కరించగా, జిల్లా కార్యదర్శి తోట రామాంజనేయులు, నాయకులు పగడాల మల్లేష్, ఏనుగు గాంధీ వివిధ ప్రాంతాల్లో పతాకావిష్కరణలు చేశారు.జిల్లా అధ్యక్షులు రావి శివరామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో నర్సింహారావు మాట్లాడుతూ 1920 అక్టోబర్ 31న ఆవిర్భవించిన ఏఐటియుసి బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన ఘనచరిత్ర కలిగి ఉందన్నారు. ఈ సందర్భంగా ఏఐటియుసి అగ్రనేత గురుదాస్ దాస్ గుప్తా వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు లక్ష్మీనారాయణ, సీతామహాలక్ష్మి, మోహనరావు, మల్లయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555